ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి

# ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

సంపుటి - 02 సంచిక -87 పేజీలు - 08 వెల - 04/- బుధవారం 8 జనవరి 2025

## హీరోయిన్ జెత్వానీ కేసు... ఐపీఎస్ లకు బెయిల్

**జెత్వానీ కేసులో ఐపీఎస్ లకు భారీ ఊరట**

**షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు**

**పీఎస్సార్ ఆంజనేయులు, కాంతి రాణా, గున్నీలకు ఊరట**



అమరావతిజనవరి 7,ఆంధ్ర ప్రగతి : ముంబై హీరోయిన్ జెత్వానీ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐపీఎస్ అధికారులకు ఏపీ హైకోర్టు భారీ ఊరటను కల్పించింది. ఐపీఎస్ అధికారులు పీఎస్సార్ ఆంజనేయులు, కాంతి రాణా తాతా, విశాల్ గున్నీలతో పాటు ఇబ్రహీంపట్నం మాజీ సీఐ హనుమంతరావు, అడ్వొకేట్ వెంకటేశ్వర్లుకు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. మరోవైపు ఈ ముగ్గురు ఐపీఎస్ లను ఇప్పటికే ఏపీ ప్రభుత్వం సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే.

## గ్రీన్ ఎనర్జీ రంగంలో యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

**గ్రీన్ స్కిల్లింగ్‌పై స్వనీతి ఇనిషియేటివ్ సంస్థతో ఏపీ ప్రభుత్వం ఒప్పందం**

**మంత్రి లోకేశ్ సమక్షంలో స్వనీతి, ఏపీఎస్ఎస్‌డీసీ ఎంఓయూ**

**పరిశోధన, డేటా, పబ్లిక్ సర్వీస్ డెలివరీలో స్వనీతి ఇనిషియేటివ్ సంస్థకు గొప్ప అనుభవం**



అమరావతిజనవరి 7,ఆంధ్ర ప్రగతి : రాష్ట్రంలో గ్రీన్ స్కిల్లింగ్ అభివృద్ధి కోసం స్వనీతి ఇనిషియేటివ్ సంస్థతో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కీలక ఒప్పందం చేసుకుంది. ఉండవల్లి నివాసంలో రాష్ట్ర మానవవనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఈ మేరకు ఎంఓయూ కుదిరింది. ప్రముఖ సామాజిక సంస్థ అయిన స్వనీతి ఇనిషియేటివ్ రాష్ట్రంలో పౌరసేవలను మెరుగుపరిచి, అట్టడుగువర్గాల అభివృద్ధికి అవసరమైన విధానాల రూపకల్పన చేస్తుంది. పరిశోధన, డేటా, పబ్లిక్ సర్వీస్ డెలివరీలో అనుభవం కలిగిన స్వనీతి ఇనియేటివ్ సంస్థ సమాజంలో వెనుకబాటుకు గురైన వారి జీవితాల్లో మార్పు కోసం కృషిచేస్తోంది.

మిగతా 2లో

## ప్రియాంకాగాంధీపై అనుచిత వ్యాఖ్యలు..



హైదరాబాద్ బీజేపీ కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ దాడి

ప్రియాంకాగాంధీపై బీజేపీ ఎంపీ అనుచిత వ్యాఖ్యలు

బీజేపీ కార్యాలయంపై రాళ్లు రువ్విన కాంగ్రెస్ శ్రేణులు

బీజేపీ దళితమోర్చా కార్యకర్త తలకు గాయం

## పెండింగ్‌లో ఆరోగ్యశ్రీ బిల్లులు

**పేదవారికి వైద్యం అందకుండా చేస్తోన్న కూటమి ప్రభుత్వం**

**నెట్‌వర్క్ ఆస్పత్రులకు 3వేల కోట్ల బకాయిలు**

**మాజీ మంత్రి విడదల రజని తీవ్ర వ్యాఖ్యలు**



2లో

## 'జననాయకుడు'ద్వారా సుపరిపాలన

**కుప్పంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం**

**జననాయకుడు పోర్టల్ ద్వారా ఫిర్యాదుల స్వీకరణ**

**ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్న చంద్రబాబు**



కుప్పం, జనవరి 7,ఆంధ్ర ప్రగతి : మోడల్ నియోజకవర్గంగా కుప్పాన్ని తీర్చిదిద్దుతామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అన్ని ప్రాంతాలతో సమానంగా.. అవసరమైతే మిన్నగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. కుప్పంలోని తెదేపా కార్యాలయంలో 'జననాయకుడు' పేరిట ఫిర్యాదుల స్వీకరణకు పోర్టల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలు, పార్టీ కార్యకర్తల సమస్యలు, విజ్ఞప్తులను సీఎం పరిశీలించారు. ప్రతి కౌంటర్ వద్దకు స్వయంగా వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమస్యలు, ఫిర్యాదులు రిజిస్టర్ చేసేలా ఈ పోర్టల్‌లో ఏర్పాట్లు చేశారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. మిగతాది 2లో...

## ఈవీఎం ట్యాంపరింగ్ జరుగుతోందనేది నిరాధార ఆరోపణ




**ఈవీఎంల ట్యాంపరింగ్ జరుగుతోందని రాజకీయ పార్టీల ఆరోపణలు**

**మీడియా ముందుకువచ్చిన కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్**

**ఈవీఎంలపై సందేహాలు అక్కర్లేదని స్పష్టీకరణ**

కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈవీఎం ట్యాంపరింగ్ జరుగుతోందనేది నిరాధార ఆరోపణ అని స్పష్టం చేశారు. ఈవీఎంలు అత్యంత భద్రతతో కూడినవని, ఈవీఎంలపై సందేహాలు అక్కర్లేదని పేర్కొన్నారు. మిగతా 2లో...

## సంక్రాంతి రద్దీకి అనుగుణంగాబస్సులు

**రానూపోనూ బుక్ చేసుకుంటే పదిశాతం రాయితీ**

**ఎపిఎస్ ఆర్టీసి ప్రకటన**




అమరావతిజనవరి 7,ఆంధ్ర ప్రగతి : సంక్రాంతి పండగ దృష్ట్యా అదనపు బస్సులు నడపాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఏపీఎస్ఆర్టీసీ నిర్ణయించింది. తెలంగాణ సహా ఇతర రాష్ట్రాలకు బస్సులు నడపాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆర్టీసీ ఎండీ ప్రకటించారు. జనవరి 8 నుంచి మొదలు 13 వరకూ ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ నుంచి పలుచోట్లకు 2,153 బస్సులు, బెంగళూరు నుంచి 375, విజయవాడ మిగతాది 2లో...



2లో

## వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ కు బెయిల్ నిరాకరణ

**మరియమ్మ హత్య కేసులో జైలుపాలైన మాజీ ఎంపీ**

**బెయిల్ పిటిషన్ కొట్టివేసిన సుప్రీంకోర్టు**

**ట్రయల్ కోర్టు ఆదేశాలలో జోక్యం చేసుకోబోమన్న సుప్రీం బెంచ్**

## నెరవేరబోతున్న రైల్వేజోన్ కల

**నేడు ప్రధాని మోడీ శంకుస్థాపన**

విశాఖపట్టణం, జనవరి 7,ఆంధ్ర ప్రగతి : రైల్వే శాఖకు సంబంధించి రాష్ట్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేరబోతోంది. ఏళ్లుగా ఊరిస్తున్న దక్షిణ కోస్తా రైల్వేజోన్ ఏర్పాటుకు కీలక ముందడుగు పడింది. విశాఖ కేంద్రంగా జోన్ కార్యాలయం నిర్మాణానికి భారత ప్రధాని నరేంద్ర మోడీ శంకుస్థాపన చేయనున్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన విశాఖ కేంద్రంగా వాల్తేర్ డివిజన్ తో కూడిన జోన్ ఏర్పాటు అనేది డిమాండ్. విభజన చట్టం 13వ షెడ్యూల్లో ఇచ్చిన హామీ మేరకు 2019 ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వం దక్షిణకోస్తా రైల్వేజోన్ ప్రకటన చేసింది. ప్రస్తుతం ఉన్న గుంతకల్లు, గుంటూరు, విజయవాడ డివిజన్లతో కలిపి జోన్ ను ఏర్పాటు చేయబోతున్నట్లు వెల్లడించింది. వాల్తేర్ డివిజన్ ను రెండు భాగాలుగా విభజించి విజయవాడ డివిజన్‌లో విలీనం చేయాలని.. మిగతాది 2లో...



# గ్రీన్ ఎనర్జీ రంగంలో యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

స్కిల్లింగ్‌కు సంబంధించి స్కిల్ డెవలప్‌మెంట్ వర్క్‌కు పూర్తిస్థాయి మద్దతు ఇస్తుంది. కీలకమైన రంగాలు, పరిశ్రమలను గుర్తించి, స్థిరమైన జాబ్ మార్కెట్‌ను ప్రోత్సహించడంపై దృష్టి సారిస్తుంది.

ఈ కార్యక్రమంలో స్వనీతి ఇనిషియేటివ్ ట్రస్టీ ఉమా భట్టాచార్య, స్టేట్ కన్సల్టెంట్ శివప్రసాద్, అసోసియేట్ తేజ సరియం, పాఠశాల విద్య, స్కిల్ డెవలప్ మెంట్ కార్యదర్శి కోన శశిధర్, స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఎండీ గణేశ్ కుమార్, స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దినేశ్ కుమార్ పాల్గొన్నారు.

ఈ ఒప్పందం ప్రకారం స్వనీతి ఇనిషియేటివ్ సంస్థ వచ్చే 4 నెలల్లో పునరుత్పాదక ఇంధన రంగానికి సంబంధించి నైపుణ్యాభివృద్ధి వ్యూహం ముసాయిదాను రూపొందించి, వ్యూహం అమలుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేస్తుంది. ఇందుకోసం రెన్యువబుల్ ఎనర్జీ సెక్టార్ కోసం స్కిల్ ల్యాండ్ స్కేప్ అసెస్ మెంట్ చేస్తుంది. కీలకమైన వాటాదారులతో (పరిశ్రమ, పరిశ్రమ సంఘాలు, క్లస్టర్ సంఘాలు, శిక్షణా సంస్థలు – ఐటీఐలు, వీటీసీ, నైపుణ్య విశ్వవిద్యాలయాలు, ఇంజనీరింగ్ కళాశాలలు మొదలైనవి) సంప్రదింపులు జరిపి నివేదిక రూపొందిస్తుంది.

జర్మనీ, అమెరికా బృందాలు, సెక్టార్ నిపుణులు, గ్రీన్ ఎనర్జీ రంగ నిపుణుల ఆలోచనలను పంచుకునేందుకు కీలకమైన భాగస్వాములతో వర్క్‌షాప్‌లు కండక్ట్ చేస్తుంది. కీలక వాటాదారుల భాగస్వామ్యంతో వ్యూహాన్ని ఖరారు చేస్తుంది. ఏపీఎస్ఎస్‌డీసీ సంస్థ... తమ ప్రధాన కార్యాలయం నుంచి పని చేసే స్వనీతి బృందానికి ప్రత్యేకంగా నైపుణ్య గణన, ఇన్ సైట్ ఇన్ఫర్మేషన్, గ్రీన్ స్కిల్లింగ్ అభివృద్ధికి సంబంధించిన ఇతర సమాచారం అందిస్తుంది. టెక్నికల్ కన్సల్టెంట్లు ఏపీఎస్ఎస్‌డీసీ తాడేపల్లి కార్యాలయంలో పనిచేయడానికి అవసరమైన స్థలాన్ని అందిస్తుంది. అనంతపురం, చిత్తూరు, వైఎస్ఆర్ కడప, కర్నూలు, నెల్లూరు జిల్లాల్లోని గ్రీన్ ఎనర్జీకి సంబంధించిన ప్రభుత్వ శాఖల విశ్లేషణలు, వారితో సంప్రదింపుల కోసం సంబంధిత ప్రభుత్వ శాఖల యాక్సెస్ ఇచ్చి, సంబంధిత సమాచారాన్ని అందిస్తుంది.

**స్వనీతి ఇనిషియేటివ్ సంస్థ చేపట్టే కార్యక్రమాలు**

1. అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు, నెల్లూరులలో గ్రీన్ ఉద్యోగాల కల్పనకు గల అవకాశాలను అంచనా వేయడానికి బేస్‌లైన్ సర్వే నిర్వహిస్తుంది. అలాగే కాకినాడ, గోదావరి, వైజాగ్‌లలో గ్రీన్ ఎనర్జీ పరిశ్రమ, సంబంధిత నైపుణ్య అవకాశాలను కూడా అంచనా వేస్తుంది.
2. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రభుత్వ బాధ్యతలను వివరిస్తూ భవిష్యత్తు అభివృద్ధి అంచనాలను రూపొందిస్తుంది.
3. గ్రీన్ స్కిల్లింగ్ రంగంలో అభివృద్ధికి అనుగుణంగా ఏమేరకు మానవవనరులు అవసరమో గుర్తిస్తుంది.
4. గ్రీన్ ఎనర్జీ నైపుణ్య అవసరాలపై ప్రత్యేకంగా దృష్టి సారించి, ఏపీఎస్ఎస్‌డీసీ నుంచి అవసరమైన డేటా లేదా సమాచారాన్ని సేకరించి విశ్లేషిస్తుంది.
5. ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో అమలుచేస్తున్న గ్రీన్ స్కిల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లను సమీక్షిస్తుంది. నైపుణ్యం కలిగిన మానవ వనరులకు అవసరమైన విద్యా కార్యక్రమాలను అన్వేషిస్తుంది.
6. ఐటీఐలు, పాలిటెక్నిక్‌లు, స్కిల్ హబ్‌లు, స్కిల్ స్పోక్స్ మొదలైన వాటిలో పరిశ్రమల అలైన్డ్ ట్రైనింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అభివృద్ధి చేయడానికి ప్రోగ్రామ్ రూపకల్పనలో మద్దతునిస్తుంది.
7. నైపుణ్య శిక్షణ, ఉపాధికి సంబంధించి రాష్ట్రంలో సహకారాన్ని కలిగి ఉండటానికి జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమ సంస్థలతో అనుసంధానం చేయడంలో ఏపీఎస్ఎస్‌డీసీకి మద్దతునిస్తుంది.
8. కేంద్ర ప్రభుత్వ పథకాలను సమీక్షించి పబ్లిక్, నిరుద్యోగ యువత, నైపుణ్యం కలిగిన అభ్యర్థుల ఉపాధి కోసం పరిశ్రమతో పాటు లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ తో అనుసంధానానికి ప్రణాళిక తయారీలో కీలకమైన ఇన్‌పుట్‌లను అందిస్తుంది.
9. సూచికల ప్రస్తుత స్థితి, పురోగతిని సమీక్షించడానికి సమగ్ర ప్రభావ అంచనాలను రూపొందిస్తుంది.
10. స్కిల్ అసెస్‌మెంట్, మ్యాపింగ్‌లో పేరొందిన ప్రీమియర్ అకడమిక్ ఇన్‌స్టిట్యూట్‌ల భాగస్వామ్యంతో అనుభవజ్ఞులైన సాంకేతిక కన్సల్టెంట్‌లను నియమిస్తుంది.

# ఈవీఎం ట్యాంపరింగ్ జరుగుతోందనేది నిరాధార ఆరోపణ

(మొదటి పేజీ తరువాయి)

ర్యాండమ్ గా వీవీ ప్యాట్ లలోని స్లిప్పులను లెక్కిస్తున్నామని, వీవీ ప్యాట్ స్లిప్పుల లెక్కింపులో ఇప్పటివరకు ఎక్కడా తేడా రాలేదని తెలిపారు. పోలింగ్ శాతం పెరుగుదలపైనా తప్పుడు ప్రచారం జరుగుతోందని అన్నారు. పోలింగ్ సమయం ముగిసే సమయానికి ఎంతో పోలింగ్ శాతం నమోదైందో ఒకసారి ప్రకటిస్తున్నామని రాజీవ్ కుమార్ తెలిపారు. పోలింగ్ సమయం ముగిశాక... అప్పటికే క్యూలైన్లలో ఉన్నవారు ఓటేస్తున్నారని, కొన్ని చోట్ల రాత్రి 8 గంటల వరకు కూడా పోలింగ్ జరుగుతోందని వెల్లడించారు. అందువల్ల పోలింగ్ శాతంపై చివరి లెక్కలు ఆలస్యంగా వస్తున్నాయని వివరించారు. గత కొన్నేళ్లుగా ఎన్నికల్లో ఓడిపోయిన రాజకీయ పార్టీలు ఈవీఎంలను నిందిస్తుండడం తెలిసిందే. ఈవీఎంల ట్యాంపరింగ్ జరుగుతోందంటూ పలు పార్టీలు గగ్గోలు పెడుతున్నాయి. ఈ ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘం పైవిధంగా స్పందించింది.

# నెరవేరబోతున్న రైల్వేజోన్ కల

(మొదటి పేజీ తరువాయి)

మిగిలిన భాగాన్ని తూర్పు కోస్తా రైల్వేజోన్ పరిధిలోని రాయగడ కేంద్రం కొత్త డివిజన్ ఏర్పాటుకు నిర్ణయించింది. ఈ ప్రక్రియలో రాయగడ డివిజన్ రూపుదిద్దుకోగా వాల్తేర్ మనుగడ మీద క్లారిటీ లేదు. జోన్, డివిజన్ కొనసాగించడం ద్వారానే ఆశించిన ప్రయోజనాలు సాధ్యం అంటున్నాయి రైల్వే యూనియన్ లు. మొత్తంగా ఎట్టకేలకు రైల్వేజోన్ కల సాకారం అవుతుండగా.. ప్రధాని మోడీ చేతులు మీదుగా శంకుస్థాపన జరుగుతుండటం రాజకీయ వర్గాల ఆసక్తిని రెట్టింపు చేసింది. విశాఖలోని ముడసర్లోవ దగ్గర రైల్వేకు కేటాయించిన భూముల్లో జోనల్ హెడ్ క్వార్టర్ సముదాయం రూపుదిద్దుకోనుంది. ఇక్కడ రైల్వేశాఖకు 52 ఎకరాల స్థలం ఉండగా, సుమారు పదెకరాల్లో కొత్త భవనాలు వస్తాయి. 149 కోట్లతో 9 అంతస్తుల్లో భవనాలు నిర్మాణం కోసం టెండర్ల ప్రక్రియను ప్రారంభించింది రైల్వేశాఖ. వాస్తవానికి దక్షిణ కోస్తా జోన్ ప్రక్రియ వైసీపీ ప్రభుత్వ హయంలోనే ప్రారంభమైనప్పటికీ భూ కేటాయింపుల్లో జాప్యం జరిగిందని రైల్వే వర్గాలు చెబుతున్నాయి. ముడసర్లోవలో ప్రతిపాదించిన భూములు రిజర్వాయర్ క్యాచ్

మెంట్ ఏరియాకు దగ్గరగా వుండటం, సాగు చేసుకుంటున్న రైతుల నుంచి అభ్యతరాలు రావడం కారణం. కూటమి ప్రభుత్వం అధికారంలో కి వచ్చిన తర్వాత జోన్ భూములపై వున్న అడ్డంకులను తొలగించేందుకు చర్యలు చేపట్టింది. చినగదిలి మండలం ముడసర్లోవలో 52.22 ఎకరాలు కేటాయించింది. గత ఆగస్టులో ఆ భూమిని రైల్వేకు అప్పగిస్తూ ప్రొసీడింగ్స్ ఇచ్చింది. మ్యుటేషన్ ద్వారా రైల్వేశాఖకు భూమి ఇచ్చినట్లు రెవెన్యూ రికార్డుల్లోనూ నమోదైంది. ఉత్తరాంధ్ర అభివృద్ధికి రైల్వేజోన్ మైల్ స్టోన్ అవుతుందని ప్రభుత్వం చెబుతోంది.. రైల్వే జోన్ కోసం భూముల కేటాయింపులో జాప్యం కారణం అవ్వడం పై అధికార, విపక్షాల మధ్య డైలాగ్ వార్ నడుస్తోంది. గత ఏడాది జనవరిలోనే తమ ప్రభుత్వం క్లియరెన్స్ ఇచ్చిందని.. అదే భూముల్లో జోనల్ కార్యాలయం నిర్మాణం చేస్తూ విమర్శలు చేయడం కరెక్ట్ కాదంటోంది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ.. ఈ వ్యవహారం పక్కన పెడితే.. తూర్పు కోస్తా రైల్వే జోన్ లో వాల్తేర్ డివిజన్ ప్రస్థానంపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

# పెండింగ్‌లో ఆరోగ్యశ్రీ బిల్లులు

**పేదవారికి వైద్యం అందకుండా చేస్తోన్న కూటమి ప్రభుత్వం**

**నెట్‌వర్క్ ఆస్పత్రులకు 3వేల కోట్ల బకాయిలు**

**మాజీ మంత్రి విడదల రజని తీవ్ర వ్యాఖ్యలు**



అమరావతిజనవరి 7,ఆంధ్ర ప్రగతి :

ఆరోగ్య ప్రదేశ్‌ను ఇప్పుడు అనారోగ్య ప్రదేశ్‌గా మార్చేశారని కూటమి ప్రభుత్వంపై మాజీ మంత్రి విడదల రజని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నెట్ వర్క్ హాస్పిటల్స్‌కు మూడువేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.. నెట్ వర్క్ హాస్పిటల్స్ వైద్యాన్ని నిలిపివేసిన పరిస్థితి నెలకొందని రజని తెలిపారు. పేద వారికి అనారోగ్యం వస్తే ఎక్కడికి వెళ్ళాలి.. ఈ ప్రభుత్వం స్పందించాలని అన్నారు.పేద వాడికి కార్పొరేట్ వైద్యం అందాలని ఆశయంతో.. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆరోగ్య శ్రీ పథకంను ప్రారంభించారని తెలిపారు. జగనన్న ప్రభుత్వంలో ఆరోగ్య శ్రీ పరిధి పెంచాం.. ఐదు లక్షల నుండి 25 లక్షలకు ఆరోగ్యశ్రీ పరిధిని పెంచామని చెప్పారు. ఒక సీఎంకి ఏ స్థాయి వైద్యం అందుతుందో.. అదే వైద్యం పేదలకు అందాలన్నది వైఎస్ కుటుంబ లక్ష్యం అని విడదల రజని తెలిపారు. పేద వారికి ఏ ఆరోగ్య సమస్య వచ్చినా.. గత ప్రభుత్వంలో ఉచితంగా నాణ్యమైన వైద్యం అందించామన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌ను ఈరోజు అనారోగ్య ప్రదేశ్‌గా మార్చేస్తున్నారని విమర్శించారు. కొవిడ్ లాంటి వ్యాధి దాడి చేసినా.. వైఎస్ జగన్ ప్రభుత్వం వెనకడుగు వేయలేదని చెప్పారు. కొవిడ్‌ను కూడా ఆరోగ్యశ్రీ పథకంలోకి తీసుకు వచ్చామన్నారు. 2014 నుండి 19 వరకు అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.5100 కోట్లు ఖర్చు చేసింది.. 2019 నుండి 24 వరకు వైసీపీ ప్రభుత్వం 13,500 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే నెట్ వర్క్ హాస్పిటల్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య శ్రీ నిర్వహణ కూడా థర్డ్ పార్టీకి అప్పగించాలని చూస్తున్నారు.. ప్రైవేటు ఇన్స్యూరెన్స్ కంపెనీలకు ఆరోగ్య శ్రీ ట్రస్ట్ నిర్వహణ అప్పగిస్తే పేద ప్రజలు ఎక్కడికి వెళ్ళాలని విడదల రజని ప్రశ్నించారు. నిబంధనల పేరుతో పేద ప్రజలను కార్పొరేట్ వైద్యానికి దూరం చేస్తారా..అని విడదల రజని ప్రశ్నించారు. ప్రతి పేదవాడికి ఆరోగ్య భద్రత కల్పించేది ఆరోగ్య శ్రీ పథకం.. అలాంటి ఆరోగ్య శ్రీని థర్డ్ పార్టీ ఊబిలోకి లాగవద్దని సూచించారు. ఆరోగ్య శ్రీని వ్యాపారం చేయవద్దు.. ఇలాంటి చర్యలను వైసీపీ వ్యతిరేకిస్తుందని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ఆరోగ్య ఆసరా ఊసే లేదన్నారు. ఉన్న మెకానిజంని పక్కన పెట్టి.. హైబ్రిడ్ మెకానిజం అని పక్క చూపులు చూడటం ఎందుకు అని విమర్శించారు. గత ప్రభుత్వం పేదల ఆరోగ్యం నిధులు ఖర్చు చేస్తే.. ఇప్పటి ప్రభుత్వం ఆ బిల్లులు చెల్లించారా అని అన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం ఏర్పడగానే.. ఆరోగ్య శ్రీ పాత బకాయిలు రూ.632 కోట్లు జగనన్న ప్రభుత్వం కట్టిందని విడదల రజని చెప్పారు.

# ప్రియాంకాగాంధీపై అనుచిత వ్యాఖ్యలు..

## హైదరాబాద్ బీజేపీ కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ దాడి

జనవరి 7,ఆంధ్ర ప్రగతి :

కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంకాగాంధీపై బీజేపీ మాజీ ఎంపీ రమేశ్ బిదూరి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఢిల్లీ రోడ్లను ప్రియాంకాగాంధీ బుగ్గల్లా మారుస్తామని ఆయన చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపడుతోంది. హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు దాడి చేశారు. రమేశ్ బిదూరి ఫొటోను చెప్పులతో కొడుతూ హంగామా చేశారు. రమేశ్ బిదూరి తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో కాంగ్రెస్, బీజేపీ శ్రేణుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. బీజేపీ కార్యాలయం లోపల నుంచి వచ్చిన ఆ పార్టీ కార్యకర్తలు కర్రలతో దాడి చేయగా... బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణులు రాళ్లు రువ్వారు. ఈ దాడిలో బీజేపీ దళితమోర్చా కార్యకర్త తలకు గాయమయింది. ఈ క్రమంలో అక్కడకు పెద్ద సంఖ్యలో చేరుకున్న పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతం బీజేపీ కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

# వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ కు బెయిల్ నిరాకరణ

అమరావతిజనవరి 7,ఆంధ్ర ప్రగతి :

మాజీ ఎంపీ, వైసీపీ నేత నందిగం సురేశ్ కు సుప్రీంకోర్టు షాకిచ్చింది. సురేశ్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ ను కొట్టివేస్తూ మంగళవారం తీర్పు చెప్పింది. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన మరియమ్మ హత్య కేసులో పోలీసులు నందిగం సురేశ్ ను అరెస్ట్ చేసి జైలుకు పంపారు. బెయిల్ కోసం నందిగం సురేశ్ ట్రయల్ కోర్టును ఆశ్రయించగా.. ఆయన పిటిషన్ ను కోర్టు తోసిపుచ్చింది. దీంతో ఆయన సుప్రీంకోర్టులో అప్పీల్ చేశారు. మాజీ ఎంపీ పిటిషన్ ను విచారించిన సుప్రీంకోర్టు జస్టిస్ దీపాంకర్ దత్తా నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం తీర్పు చెబుతూ.. తనపై నమోదైన క్రిమినల్ కేసుల వివరాలను దాచారనే కారణంతో ట్రయల్ కోర్టు నందిగం సురేశ్ బెయిల్ పిటిషన్ తిరస్కరించిందని గుర్తుచేసింది. దీంతో ట్రయల్ కోర్టు ఆదేశాలలో తాము కల్పించుకోబోమని పేర్కొంటూ మాజీ ఎంపీ బెయిల్ పిటిషన్ ను తోసిపుచ్చింది.తుళ్లూరు మండలం వెలగపూడికి చెందిన ఎస్సీ మహిళ మరియమ్మ 2020లో హత్యకు గురైంది. అప్పట్లో ఏపీ సీఎం వైఎస్ జగన్ తమను మోసం చేశారని మరియమ్మ బహిరంగంగా దూషించింది. తనకు పెన్షన్ ఆపేశారని, ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని మండిపడింది. దీంతో నందిగం సురేశ్ అనుచరులు మరియమ్మ ఇంటిపై దాడి చేశారు. మరియమ్మను తీవ్రంగా కొట్టి చంపేశారు. ఫిర్యాదు చేసినా అప్పట్లో పోలీసులు పట్టించుకోలేదని, కేసును పక్కన పెట్టారని మరియమ్మ కుమారుడు ఆరోపించాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి నారా లోకేశ్ ను కలిసి న్యాయం చేయాలంటూ మరియమ్మ కుమారుడు విజ్ఞప్తి చేశాడు. మంత్రి లోకేశ్ ఆదేశాలతో కేసు దర్యాప్తులో వేగం పెంచిన పోలీసులు.. మాజీ ఎంపీ నందిగం సురేశ్ ను అరెస్టు చేసి జైలుకు పంపించారు.

# 'జననాయకుడు'ద్వారా సుపరిపాలన

(మొదటి పేజీ తరువాయి)

'ఫిర్యాదుల స్వీకరణకు 'జననాయకుడు' పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ప్రజలతో పాటు తెదేపా నేతలు, కార్యకర్తలు తమ ఫిర్యాదులు, సమస్యలను నమోదు చేయవచ్చు. వాట్సప్ ద్వారా కూడా సమాచారం ఇవ్వొచ్చు. వాటిని పోర్టల్‌లో నమోదు చేసి విశ్లేషించి పరిష్కారం చూపుతాం. స్థానిక ఎమ్మెల్యేగా ఈ నియోజకవర్గం విషయంలో నాపై ప్రత్యేక బాధ్యత ఉంది. ఇక్కడి ప్రజలు వరుసగా 8 సార్లు గెలిపించారు. సీఎంగా ఉన్నందున అంచనాలు ఎక్కువగా ఉంటాయి. ఏ అర్జీ వచ్చినా నిర్దిష్ట సమయంలో పరిష్కార మార్గం చూపిస్తాం. ఇది వినూత్న ప్రయోగం' అని చంద్రబాబు అన్నారు. స్వర్ణ కుప్పంలో భాగంగా ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు చేశారు. వివిధ కంపెనీల ప్రతినిధులతో సీఎం సమావేశమయ్యారు. చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం ఐపీ తంబిగాని పల్లి, తంబి గానిపల్లి గ్రామంలో 41.22 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న ప్రాసెసింగ్ ప్లాంట్‌కు సీఎం శంకుస్థాపన చేశారు. మదర్ డెయిరీ ఫ్రూట్ విజిటబుల్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.105.10 కోట్ల వ్యవయంతో ఈ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు. 4800 మందికి ఉపాధి దిశగా ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఫ్రూట్ పల్ప్ (మామిడి, టమోటా) తయారీ ద్వారా 50 వేల మంది రైతులకు ప్రయోజనం పొందేలా చర్యలు చేపడుతున్నట్లు మదర్ డైరీ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ జయ తీర్థ చారి.. సీఎంకు వివరించారు.అలాగే శాంతిపురం మండలం ఐపీ తంబి గానిపల్లి, తంబి గానిపల్లి గ్రామం వద్ద 40 ఎకరాలలో ఏసీఐఐసీ ద్వారా శ్రీజ ప్రొడ్యూసర్ కంపెనీ (పాల పొడి తయారీ)కి భూమిని కేటాయించారు. దాదాపు రూ.233 కోట్లతో 4000 మందికి ఉపాధి కల్పించే విధంగా ఈ ప్రాజెక్టను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టులో ఇప్పటికే లక్ష మంది మహిళా రైతుల భాగస్వామ్యంగా ఉన్నారని ముఖ్యమంత్రికి సీఈఓ తిమ్మప్ప, చైర్మన్ శ్రీదేవి వివరించారు. ఒకే రోజు 200 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి చేసే సామర్థ్యం గల క్యాటిల్ ఫీడ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. కుప్పం మున్సిపాలిటీలో అర్బన్ ప్రాజెక్టుల నిర్వహణ, అధికారుల అతిథి గృహాల నిర్మాణం కోసం సమీకృత కాంప్లెక్స్‌లో రూ.10 కోట్ల అంచనా వ్యయంతో కమాండ్ కంట్రోల్ రూమ్ (2 అంతస్తులు) నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. డీకే పల్లి పార్కుల అభివృద్ధి, సుందరీకరణ, కుప్పం ఏరియా అభివృద్ధిలో రోడ్డు జంక్షన్లు, వీధి దీపాలను ప్రత్యేక గ్రాంట్లతో రూ.60.20 కోట్ల అంచనా వ్యయంతో కుప్పంలో ఏర్పాటు చేశారు. అలాగే రూ. 110.21 కోట్లతో కుప్పం నియోజకవర్గంలోని 451 డ్రైనేజీ వర్కులను, జీఎస్ హెచ్11- ఎస్‌డీపీ నిధుల ద్వారా చేపట్టిన పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభోత్సవం చేశారు.

# సంక్రాంతి రద్దీకి అనుగుణంగాబస్సులు

(మొదటి పేజీ తరువాయి)

నుంచి 300 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు చెప్పారు. తిరుగు ప్రయాణానికి ఈ నెల 16 నుంచి 20 వరకు 3,200 ప్రత్యేక బస్సులను నడపనున్నామని ఎండీ పేర్కొన్నారు. ప్రత్యేక బస్సుల్లో ఎలాంటి అదనపు ఛార్జీలుండవని, సాధారణ ఛార్జీలనే వసూలు చేస్తామన్నారు. ఒకేసారి రెండు వైపులా టికెట్లు బుక్ (చేసుకుంటే టికెట్ ధరపై 10 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ఆర్టీసీ ఎండీ తెలిపారు. ప్రత్యేక బస్సుల్లో ముందస్తు టికెట్ బుకింగ్ చేసుకునే సౌకర్యాన్ని కల్పించామన్నారు. ఆర్టీసీ బస్సుల్లో సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణం చేయాలని.. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఎక్కడికక్కడ ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

# వైసీపీ నేత పేర్ని నానికి హైకోర్టులో ఊరట

## బెయిల్ పిటిషన్ విచారణ 20కి వాయిదా

అమరావతిజనవరి 7,ఆంధ్ర ప్రగతి : ఏపీలో సంచలనం సృష్టించిన బియ్యం మాయం కేసులో మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నానికి హైకోర్టులో కాస్త ఊరట లభించింది. ఈ కేసుకు సంబంధించి పేర్నినాని వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ వాయిదా పడింది. తదుపరి విచారణను ఈనెల 20కి ధర్మాసనం వాయిదా వేసింది. అప్పటి వరకు తొందరపాటు చర్యలు వద్దని పోలీసులకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో రేషన్ బియ్యం అమ్ముకున్న ఘటనలో ఏ6గా పేర్నినాని ఉండగా, ఏ1గా పేర్నినాని సతీమణి జయసుధ ఉన్నారు. గోడౌన్ మొత్తం కూడా జయసుధ పేరుమీద ఉండటంతో మొదటి నుంచి ఈ కేసులో జయసుధ ఉన్నారు. అయితే ఏ6గా పేర్నినాని చేర్చారు పోలీసులు. ఈ విషయం తెలిసిన వెంటనే పేర్నినాని హైకోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేశారు. నిన్న ఈ కేసుపై విచారణ జరుగగా.. నేటికి వాయిదా వేసింది హైకోర్టు. ఈరోజు మరోసారి పేర్నినాని పిటిషన్‌పై హైకోర్టులో విచారణకు వచ్చింది. ఇరువురి వాదనలు విన్న



న్యాయస్థానం.. జనవరి 20 (సోమవారం) వరకు ఎటువంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశిస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
బుధవారం 8 జనవరి 2025

# శ్రీమద్రామాయణం భారతీయుల జీవనాడి

### -డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తితిదే

### -పారుమంచాలలో ప్రారంభమైన తితిదే ధార్మిక కార్యక్రమాలు.



ఆంధ్ర ప్రగతి జూపాడుబంగ్లా జనవరి 07: శ్రీమద్రామాయణం భారతీయుల జీవనాడి అని, మానవీయ విలువలకు పట్టం కట్టిన శ్రీమద్రామాయణం యావత్ సృష్టి ఉన్నంతవరకు ఆదర్శంగానే నిలుస్తుందని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా, జూపాడుబంగ్లా మండలం, పారుమంచాల గ్రామంలో వెలసిన శ్రీ రామాలయం నందు నాలుగు రోజుల ధార్మిక కార్యక్రమాల ప్రారంభం సందర్భంగా వారు ప్రారంభోపన్యాసం చేశారు. తదనంతరం తితిదే ధర్మాచార్యులు ఆమంచి వేంకటేశ్వర్లు చేసిన శ్రీమద్రామాయణం మానవీయవిలువలు అనే అంశంపై ప్రవచించారు. ఈ కార్యక్రమంలో భజన మండలి అధ్యక్షుడు పాల రాముడు, పి. శివారెడ్డి, పి.లోకేశ్వర రెడ్డి, కె.జనార్ధన రెడ్డి, ధర్మ ప్రచార మండలి సభ్యులు పి.రామచంద్రుడు, పాపయ్యాచారి, సి.చెన్నప్ప ఎస్.వెంకటస్వామి, వి.హరి, నాయుడు, సి.వెంకట రమణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## తమ్మరాజు పల్లి అంగన్వాడి టీచర్ పై దాడి చేసిన శివకుమార్ ను కఠినంగా శిక్షించాలి.

### -సీఐటీయూ



ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 07: తమ్మరాజు పల్లె అంగన్వాడి టీచర్ జయలక్ష్మి పై దాడి చేసిన శివకుమార్ ను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బాల వెంకట్ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. నిర్మలమ్మ, బి. సునీత లు డిమాండ్ చేశారు మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో తమ రాజు పల్లె లోని అంగన్వాడి సెంటర్లో జయలక్ష్మి అనే అంగన్వాడి టీచర్ విధులు నిర్వహిస్తున్న సమయంలో జయ కుమార్ అనే వ్యక్తి ఫుల్లుగా తాగి వచ్చి పాత కక్షలతో లంజముండ నువ్వు డ్యూటీ మానుకో లేకపోతే నేను చంపేస్తా పిల్లలకు గుడ్లు పంచకుండా నువ్వు ఏమి చేస్తున్నావు అని బెదిరించి ఇష్టం వచ్చినట్టు కింద పడేసి తన్ని కాలుతో, రాడ్ తో కన్ను పైన కొట్టడం వల్ల కన్ను చూపు కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.జయలక్ష్మి విధులకు ఆటంకం కలిగిస్తూ అనేక సందర్భాల్లో ఇబ్బందులకు గురి చేస్తూ జయలక్ష్మిని అంగన్వాడి విధులకు ఆటంకం కలిగిస్తూ నువ్వు ఉద్యోగం చేస్తే చంపుతాము అని బెదిరిస్తూ ఆమెను చంపడానికి ప్రయత్నించిన శివ కుమార్ ను కటినంగా శిక్షించాలని కోరారు. లేకపోతే ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు.

## విద్యార్థులకు స్ఫూర్తిదాయక ప్రసంగం.







ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 07: గ్రామీణ ప్రాంతాల నుంచి ఇంటర్మీడియట్ చదువుతున్న పేద విద్యార్థులకు ఇంటర్మీడియట్ స్థాయిలో ఏ విధంగా లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలి దానికి ఏ విధంగా సాధించాలో వివరించడం జరిగింది. రెండు సంవత్సరాల ఇంటర్మీడియట్ భవిష్యత్ దర్శనం ద్వారా జీవితాన్ని ఆనందమయం చేసుకుంటూ ఏ విధంగా లక్ష్యాన్ని సాధించాలో పవర్ పాయింట్ ద్వారా వివరించడం జరిగింది. డాక్టర్ చిత్తలూరు మధుసూదన్ రావు ఐఎంఈ నంద్యాల ప్రెసిడెంట్ ఈ స్ఫూర్తిదాయక ప్రసంగాన్ని 200 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు దీబగుంట్ల ప్రభుత్వ కళాశాలకు వెళ్లి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమం నంద్యాల ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సౌజన్యంతో జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ బాలచంద్రుడు, కళాశాల శ్రేయోభిలాషి శంభు ప్రసాద్ ఇతర కాలేజీ అధ్యాపక బృందం కూడా ఇందులో పాల్గొనడం జరిగింది. 7-1-25 మంగళవారం మూడు గంటల నుంచి నాలుగు గంటల వరకు ఈ కార్యక్రమం జరిగింది.

# 76వ భారత గణతంత్ర వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయండి..!

### -జిల్లా అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.







ఆంధ్ర ప్రగతి నంద్యాల, జనవరి 07: జిల్లాలో ఈనెల 26వ తేదీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో 76వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా పెద్ద ఎత్తున నిర్వహించుకునేందుకు ఇప్పటినుండే ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, డి.ఎస్.పి శ్రీనివాసరెడ్డిలతో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటినుండే ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కళాశాల మైదానాన్ని ఆకర్షణీయమైన రీతిలో తీర్చిదిద్దడంతో పాటు జాతీయ పతాక ఆవిష్కరణ, పరేడ్ మార్చ్ ఫాస్ట్ లో సాయుధ దళాలు, ఎన్ఎస్ఎస్, ఎన్సిసి కేడెట్లు, స్కౌట్లు తదితర కంటిజెంట్స్ అధికంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. వేదిక, విఐపిలు, అధికారులు, ప్రజలు, విద్యార్థులు కూర్చునేందుకు ఎండ తగలకుండా పెండాల్స్ సీటింగ్ ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆర్ అండ్ బి, రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఐదు శాఖలకు రోలింగ్ షీట్ లు బహూకరిస్తామన్నారు.

దేశభక్తి ఉట్టిపడేలా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులచే తక్కువ నిడివి గల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని డిఇఓను కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింభించేలా వ్యవసాయం, డిఆర్డిఏ, హౌసింగ్, వైద్యం, డ్వామా, వ్యవసాయ అనుబంధ రంగాలు తదితర అన్ని సంక్షేమ శాఖలు ఏర్పాటు చేసే శకటాల ప్రదర్శన ఆకర్షణీయంగా అందరినీ ఆకట్టుకునేలా ఉండాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆయా శాఖలు ఎగ్జిబిషన్ స్టాల్స్ ను కూడా ఏర్పాటు చేసి ఇప్పటివరకు సాధించిన అభివృద్ధిని ప్రదర్శించాలన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకల ఆహ్వాన పత్రికలను ముందుగానే ప్రచురించి ప్రోటోకాల్ ప్రకారం అందరికీ ముందుగానే పంపిణీ చేయాలని డిఆర్ఓను సూచించారు. గత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో తలెత్తిన గ్యాప్ ను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా వేడుకల నిర్వహణపై జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లాధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ రాము నాయక్, సిపిఓ వేణుగోపాల్, ఆర్అండ్బి ఎస్ఇ శ్రీధర్ రెడ్డి, డిఆర్డిఎ పిడి శ్రీధర్ రెడ్డి, డ్వామా పీడీ జనార్దన్ రావు, డిఎంహెచ్ డా. వెంకటరమణ, డీఈఓ జనార్దన్ రెడ్డి, ఇతర జిల్లాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే వరకు పోరాటం ఆగదు

ఆంధ్ర ప్రగతి నంద్యాల అర్బన్ జనవరి 07: అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ను. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే వరకు పోరాటం ఆగదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి .సుంకయ్య అంగన్వాడి వర్కర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు వసుంధర దేవి వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రకళ ఏఐటియుసి నంద్యాల పట్టణ అధ్యక్ష కార్యదర్శులు డి శ్రీనివాసులు, భూమన శ్రీనివాసులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఏఐటియుసి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటీయూసీ జాతీయ సమితి పిలుపు మేరకు నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నాకు వసుంధర దేవి అధ్యక్ష వహించారు. ధర్నాను ఉద్దేశించి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి సుంకయ్య మాట్లాడుతూ గత ఎన్నికల కన్నా ముందు రాష్ట్రంలో ఉన్న అంగన్వాడి వర్కర్స్ లక్ష మందికి పైగా రాష్ట్ర ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చి 42 రోజులుగా సమ్మె నిర్వహించడం జరిగింది. అప్పుడు అధికారంలో ఉన్న జగన్ ప్రభుత్వం అంగన్వాడి వర్కర్లను వేతనాలు పెంచకుండా సమ్మె చేసినందుకు పోలీసులతో బెదిరించి కేసులు పెట్టి పోలీసులు పెట్టి నిర్బంధించి అనేక ఇబ్బందులకు గురిచేసి ఒక్క రూపాయి కూడా వేతనం పెంచలేదు ఆ సందర్భంలో ఎన్నికల బహిరంగ సభలో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ నేను అధికారంలోకి వస్తే అంగన్వాడి వర్కర్స్ కు వేతనాలు పెంచడంతోపాటు అన్ని రకాలుగా ఆదుకుంటానని హామీ ఇచ్చారు కానీ నేడు అధికారంలోకి వచ్చి 5 నెలలు దాటిన సంబంధిత




మంత్రులను రాష్ట్ర స్థాయి అధికారులను కలిసి విన్నవించిన అంగన్వాడి వర్కర్ల సమస్యల పట్ల పూర్తిగా నిర్లక్ష్యంగా ఉన్నటువంటి పరిస్థితి చూస్తున్నాం, హామీలు ఇచ్చి అంగన్వాడి వర్కర్ల వేతనాలు పెంచకుండా నిర్లక్ష్యం చేయడం చాలా అన్యాయమని వారు అగ్రహించారు . చాలీచాలని వేతనంతో నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడం అలాగే కరెంటు చార్జీలు పెంచడం వలన తమ కుటుంబాలు గడవక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా రని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏ పథకము ప్రజల దగ్గర చేరాలో అన్ని చేస్తున్న విపరీతంగా పని ప్రారంభించి అనేక యాప్లు పెట్టి 8గంటల పరిమితధానాన్ని తుంగలో తొక్కారని వారన్నారు. తెలంగాణలో మాదిరి 18 వేల వేతనం పెంచాలని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని విదులలో మరణిస్తే తగిన ఎక్స్గ్రేషియా ఇచ్చి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని మట్టి ఖర్చులకు 20 వేల రూపాయలు అందించాలని అంగన్వాడి వర్కర్లు అందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని వీటితో పాటు అనేక సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.ఆశా మధ్యాహ్న భోజనం వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి. పెరిగిన ధరలు కనుగుణంగా ఆశా మధ్యాహ్నం భోజనం వర్కర్లకు కనీస వేతనం 26,000 ఇచ్చి పని భారం తగ్గించాలని ఆశ వర్కర్లను సచివాలయాలకు సంబంధం లేకుండా వైద్యరంగం ద్వారా విధులు నిర్వహించుటకు ఆదేశాలు ఇవ్వాలన్నారు ఆశ వర్కర్లు అనేక యాపులు పెట్టి 24 గంటలు పని చేస్తున్నారు అని పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు అర్హత గల ఆశ వర్కర్లను ఏఎన్ఎంలుగా ప్రమోషన్ ఇవ్వాలని కోరారు మధ్యాహ్న భోజన వర్కర్లకు పదివేల రూపాయల వేతనం ఇచ్చి మెస్ చార్జీలు పెంచాలని వంటగదులు నిర్మించి ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని పని భద్రత కల్పించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వెంకట వెంకటసుబ్బమ్మ ఇందు సునీత సుజాత అధిక సంఖ్యలో వర్కర్స్ పాల్గొన్నారు.

# పశ్చిమలో సంక్రాంతి సందడి

### పండగకు ముందే కాలు దువ్వుతున్న కోళ్లు

ఏలూరుజనవరి 7,ఆంధ్ర ప్రగతి :ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సంక్రాంతి సందడి నెలకొంది. పండగకు ముందే పందెంరాయుళ్లు కాలుదువ్వుతున్నారు. సంక్రాంతికి ముందే గుట్టుగా పందేలు నిర్వహిస్తున్నారు. హడావుడి లేకుండా..రాత్రి వేళల్లో పందేలు వేస్తున్నారు. కట్టడి చేయాల్సిన పోలీసులు ఆ వైపు కన్నెత్తి చూడటం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరం, ఆకివీడు, కామవరపుకోట, కలిదిండి, దెందులూరు, పెదవేగి తదితర మండలాల నుంచి కోళ్లను భారీగా కొనుగోలు చేశారు. ఉమ్మడి



నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి సైతం పెద్ద ఎత్తున కోళ్లు గోదావరి జిల్లాల్లో కూత పెడుతున్నాయి. ఇప్పటికే దాదాపు చిన్నా పెద్ద అన్ని పందేల్లో కలిపి దాదాపు రూ.100 కోట్లు చేతులు మారాయని తెలుస్తోంది. పందేలపై ఆసక్తి ఉండి..ఆర్థికంగా బలంగా ఉన్న వారికి మాత్రమే నిర్వాహకులు సమాచారం ఇస్తున్నారు. బరులు ఏర్పాటు చేస్తున్నట్లు హడావుడి లేకుండా రాత్రి 7 గంటల తర్వాత ట్రాక్టర్లతో చదును చేసి, లైట్లు పెట్టి తెల్లారేలోగా కథ ముగించేస్తున్నారు. ఒకే ప్రాంతంలో తరచూ పందేలు వేయకుండా వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారు. భీమవరం, ఉండి నియోజకవర్గాల్లో రెండు నెలలుగా ఒక్కో వారం ఒక్కో మండలంలో పందేలు వేస్తున్నారు. సమాచారం ఇచ్చిన వారు మాత్రమే బరిలోకి వచ్చేలా గుర్తింపు కార్డులు ఇస్తున్నారు. వీడియోలు, ఫొటోలు తీయకుండా ముందుగానే ఫోన్లు తీసుకుంటున్నారు. తాజాగా ఉండి మండలం సీసలిలో భారీ ఎత్తున పందేలు వేశారు. ఒక్కో పందేనికి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల చొప్పున రూ.50 లక్షలకు పైగా చేతులు మారాయని తెలుస్తోంది. కొద్ది రోజుల క్రితం భీమవరం శివారులోని ఖాళీ స్థలాల్లో రాత్రంతా నిర్వహించారు. పందేలు నిర్వహించేవారిపై చర్యలు తీసుకుంటామని, బైండోవర్ చేసి నియంత్రిస్తామని ఏలూరు రేంజి డీఐజీ అశోక్‌కుమార్ తెలిపారు.

## రోగులకు మెరుగైన సేవలు అందించాలి

### -ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని.



ఆంధ్ర ప్రగతి మహానంది జనవరి 07: గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని మహానంది మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు బుడ్డా రెడ్డి యశస్విని పేర్కొన్నారు. నేడు మహానంది మండలం తిమ్మాపురం, గాజులపల్లి గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనకి చేసి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలోని రోగులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో ఉన్నటువంటి బాలింతకు వైద్య ఖర్చులకై 2000 రూపాయలు తమ వంతుగా సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటరెడ్డి, బుక్కాపురం టిడిపి నాయకులు కందుల రాంభూపాల్ రెడ్డి మరియు ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల అభివృద్ధికి బృహత్ ప్రణాళిక..!

-శాశ్వత కలెక్టరేట్ కాంప్లెక్స్ ఏర్పాటుకు చర్యలు. -ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం.
-రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్.
-నంద్యాల రూరల్ తహసిల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి ఫరూక్.







ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 7:
దేశంలోనే నంద్యాల కు ఒక ప్రత్యేకమైన స్థానం ఉందని, నంద్యాలను అన్ని రంగాలలో ఉన్నత స్థాయిలో నిలబడమే లక్ష్యంగా బృహత్ ప్రణాళికతతో ముందుకు సాగుతున్నట్లు రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. మంగళవారం నంద్యాల రూరల్ తహసిల్దార్ కార్యాలయాన్ని మంత్రి ఫరూక్, కలెక్టర్ జి రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్ లతో కలిసి ప్రారంభించారు. రెవిన్యూ పరిపాలన సౌలభ్యం కోసం నంద్యాల తహసీల్దార్ కార్యాలయాన్ని అర్బన్ మరియు రూరల్ విభాగాలుగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా రూరల్ తహసిల్దార్ కార్యాలయంను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. తహసిల్దార్ కార్యాలయం ప్రారంభించిన అనంతరం మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ రాజకీయంగా, విద్యాపరంగా, వ్యవసాయం , పారిశ్రామిక రంగం, సేవా రంగం తదితర రంగాలలో, సామాజిక,ఆర్థిక రంగాలలో నంద్యాలకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉన్నదని అన్నారు. జిల్లా కేంద్రమైన నంద్యాలను అన్ని రంగాలలో ఉన్నత స్థానంలో నిలిపేందుకు ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. నంద్యాల ప్రాంత అభివృద్ధికి ఎంతోమంది మేధావులు, ప్రముఖులు, అధికార యంత్రాంగం కృషిచేసి ఆదర్శప్రాయులుగా నిలిచారని అన్నారు. జిల్లా కేంద్రంగా నంద్యాల ఏర్పడిన తర్వాత కలెక్టరేట్ కాంప్లెక్స్ ను ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఆవరణంలో తాత్కాలికంగా ఏర్పాటు చేయడం జరిగిందని, అయితే శాశ్వత ప్రాధిపదికన కలెక్టరేట్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం, నిధుల మంజూరు కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నంద్యాల జిల్లా ప్రజల తరఫున వారి ఆకాంక్ష మేరకు వీలైనంత త్వరగా నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని మంత్రి ఫరూక్ తెలిపారు. నంద్యాల జిల్లాను అభివృద్ధి పథంలో ఉన్నత స్థానంలో నిలిపేందుకు జిల్లా కేంద్రం కు చెందిన స్థానిక ప్రజాప్రతినిధిగా, మంత్రిగా కృషి చేస్తానని అన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం సమన్వయంతో జిల్లా అభివృద్ధికి తోడ్పడాల్సిన అవసరం, ఆవశ్యకత, భాగస్వామ్యం ఉండాలని మంత్రి ఫరూక్ ఆకాంక్షించారు.

ప్రజలకు సత్వర సేవలు అందించడమే లక్ష్యం – కలెక్టర్ జి రాజకుమారి

ప్రజలకు ప్రభుత్వ శాఖల ద్వారా సత్వర సేవలు అందించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి అన్నారు.నంద్యాల రూరల్ తాహసిల్దార్ కార్యాలయం ప్రారంభోత్సవం అనంతరం,జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడారు. నంద్యాల మండలంలో 20 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయని భూ సంబంధిత దరఖాస్తులు, ఇతర సర్వీసులకు సంబంధించిన అంశాలు అధికంగా ఉన్న నేపథ్యంలో నంద్యాల రూరల్ మండల ఏర్పాటుకు నిమిత్తం ప్రభుత్వం అంగీకరించిందన్నారు. ఈ మేరకు మంత్రి చేతుల మీదుగా నంద్యాల అర్బన్ తాసిల్దార్ కార్యాలయ భవన ప్రాంగణంలోనే రూరల్ మండల కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేసుకున్నామన్నారు. రూరల్ మండల కార్యాలయ పరిధిలో 13 రెవెన్యూ గ్రామాలు వస్తాయన్నారు. మండల పరిధిలోని సచివాలయాలను కూడా అనుసంధానం చేసి అధికారులు, ప్రజలకు అందుబాటులో ఉండి సత్వర సేవలు అందించేందుకు ఆదేశాలు జారీ చేశామని కలెక్టర్ తెలిపారు. అనంతరం మండల కార్యాలయ ఆవరణలో మంత్రి, కలెక్టర్ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల రూరల్ తహసిల్దార్ పి. సత్య శ్రీనివాసులు, అర్బన్ తహసిల్దార్ ప్రియదర్శిని తోపాటు పలువురు రెవిన్యూ అధికారులు సిబ్బంది, రాజకీయ ప్రముఖులు, వివిధ రంగాలకు చెందిన పలువురు పాల్గొన్నారు.

# శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం.!





ఆంధ్ర ప్రగతి తిరుమల జనవరి 07:
తిరుమల శ్రీవారి ఆలయంలో జనవరి 10వ తేదీన వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయం వెలుపల టీటీడీ చైర్మన్ శ్రీ బిఆర్ నాయుడు, ఈవో శ్రీ జె శ్యామలరావు మీడియాతో మాట్లాడుతూ, సాధారణంగా ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ సందర్భంగా ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను పవిత్రమైన పరిమళ జలాన్ని ప్రోక్షణ చేసి, నీటితో శుభ్రంగా కడుగుతారని చెప్పారు.కాగా, స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచి, శుద్ధి అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేశారు. ఆ తరువాత స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు.

# ముగ్గుల పోటీలను జయప్రదం చేయండి.



ఆంధ్ర ప్రగతి మహానంది జనవరి 07:
మహానంది మండలం అబ్బిపురం గ్రామంలోని గిరిజన కాలనీలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగే ముగ్గుల పోటీలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న,సిపిఐ మండల కార్యదర్శి సామేలు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ..ముగ్గులు పోటీలకు ముఖ్య అతిధులుగా, అధికారులు, నాయకులు పాల్గొంటారన్నారు.భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 1925 కాన్పూర్ నగరంలో ఆవిర్భావించి 2025 నాటికి 100 సంవత్సరాలు పూర్తయిందని తెలిపారు. వంద సంవత్సరాల కాలంలో దేశం, రాష్ట్రంలో ప్రజా సమస్యలు, లక్షలాది ఎకరాలు, భూములను, భూ పోరాటాల ద్వారా ప్రజలకు పంచి పెట్టిన ఘనత భారత కమ్యూనిస్టు పార్టీ దేనని అన్నారు. అటువంటి చరిత్ర కలిగిన కమ్యూనిస్టు పార్టీ లోని ప్రజాసంఘమే ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం ద్వారా, రైతు సమస్యలపై అలుపెరిగిన పోరాటం చేసిన చరిత్ర ఉందని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి గురుమూర్తి, సిపిఐ నాయకులు దస్తగిరి, వలి పాల్గొన్నారు.

# రాజ్యాంగ పరిరక్షణ సదస్సును జయప్రదం చేయండి.



ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 07:
నంద్యాల పట్టణంలో సదస్సు కరపత్రాలను విడుదల చేసిన సిపిఐ (యంయల్)లిబరేషన్ జిల్లా నాయకులు పిక్కిలి.వెంకటేశ్వర్లు, గాలి రవి రాజా ఏఐఎస్ఎ ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఎస్.నాగర్జునరాజ్యాంగ వ్యతిరేక విధానాలను తిట్టుకొట్టాలని పిలుపునిచ్చిన సిపిఐ(యం యల్ )లిబరేషన్ జిల్లా నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు నంద్యాల పట్టణంలో సిపిఐ (యం యల్)లిబరేషన్ నాయకుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా సిపిఐ(యం యల్) లిబరేషన్ జిల్లా నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు జిల్లా నాయకులు గాలి రవి రాజా మహిళా సంఘం నాయకురాలు బిబి,లక్ష్మీదేవి, జిల్లా కార్యదర్శి నాగార్జున పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారత దేశ అభివృద్ధికి ప్రజాసుపరిపాలన కోసం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో రచించిన రాజ్యాంగం అమలుకు మనువాద బీజేపీ కి ఏమాత్రం ఇష్టం లేదని రాజ్యాంగంలోని ఆదేశ సూత్రాలను అమలు చేయడంలో బిజెపి విఫలమైందని నేడు బిజెపి రాజ్యాంగానికి విరుద్ధంగా దళితులను మైనార్టీలను బడుగు బలహీన వర్గాలను నిరంకుశంగా అనగతొక్కుతుందని దేశంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు ఎక్కువయ్యాయని మణిపూర్ లో ఒక వర్గం ప్రజలపై దాడులు బాబ్రీ మసీద్ కుల్చివేత పౌరసత్వ సవరణ బిల్లు,ఒకే దేశం ఒకే ఎన్నిక పేరుతో దేశ భవిష్యత్తును ప్రమాదానికి నెట్టి వేస్తుందని విధానాలపై ప్రశ్నించే రాజ్యాంగం పట్ల విశ్వాసం లేని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చుటకు ప్రయత్నం చేస్తుందని అమిత్ షా అహంకార పూరితంగా అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అవమానపరిచిన వైఖరికి నిరసనగా అమీషా రాజీనామా చేయాలని భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం.. దేశాన్ని రక్షించ్చుకుందాం అనే నినాదంతో సిపిఐ(యం యల్) లిబరేషన్ ఆధ్వర్యంలో రాయలసీమ జిల్లాల సదస్సును కర్నూల్ లో జనవరి 20 అంబేద్కర్ భవన్ లో ఏర్పాటు చేయడం జరిగిందని కావున సదస్సులో రాయలసీమ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రజాసంఘాలు దళిత సంఘాలు వామపక్షాలు లౌకిక ప్రజాస్వామ్యవాదులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చంద్రుడు, వర్ధన్,రాజు, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పార్ముాలా కార్ కేసులో ఎపిలో లింకులు

## మచిలీపట్నంలో ఎసిబి సోదాలు

అమరావతి,జనవరి 7,ఆంధ్ర ప్రగతి : తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. తెలంగాణ హైకోర్టు తీర్పుతో ఏసీబీ అధికారులు ఫార్ములా ఈ రేసు కేసులో దూకుడు పెంచారు. ఫార్ములా–ఈ కేసులో పలుచోట్ల ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి సోదాలు చేపట్టారు. ఈ కేసుతో ఆంధ్రప్రదేశ్‌తోనూ లింక్ ఉందని అధికారులు గుర్తించారు. దీంతో ఏసీబీ అధికారులు మంగళవారం ఏపీకి వెళ్లి సోదాలు నిర్వహించారు. పలు కార్యాలయాల్లో సోదాలు నిర్వహించి కీలక డాంక్యుమెట్లను స్వాధీనం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. మచిలీపట్నంలో ఏస్ అర్బన్ డెవలపర్స్ కార్యాలయంలోకి ఏసీబీ అధికారులు ప్రింటర్లు తీసుకువెళ్లారు. పలు డాక్యుమెంట్లను ఏసీబీ బృందం కాపీలు తీసుకుంటున్నారు. మొత్తం 12 మంది ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ కార్ రేస్‌కు సంబంధించి నిధులు ఏ అకౌంట్ నుంచి వచ్చాయనే అంశంపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. సిబ్బందిని అడిగి పలు వివరాలు సేకరిస్తున్నారు. తెలంగాణ నుంచి వచ్చిన ఏసీబీ ఉన్నతాధికారుల బృందం తనిఖీలు చేస్తోంది. ఇప్పటికే హైదరాబాద్‌లో ఏసీబీ బృందం ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. చలమశెట్టి సునీల్‌కు చెందిన గ్రీన్కో అనుబంధ సంస్థ అని తెలంగాణ పోలీసులు చెబుతున్నారు. చలమశెట్టి సునీల్ జన్మస్థలం కృష్ణా జిల్లా మచిలీపట్నం. సునీల్ తల్లి వెంకటలక్ష్మి గతంలో బందర్ మున్సిపల్ చైర్మన్‌గా పనిచేశారు. తెలంగాణ నుంచి ఉదయాన్నే ఏసీబీ బృందం అధికారులు వచ్చారు. పై అధికారుల ఆదేశాల మేరకే తాము సోదాలు చేస్తున్నామని తెలంగాణ ఏసీబీ అధికారులు తెలిపారు.




# జయరాజ్ ఇస్పాట్ స్టీల్ ప్లాంట్ లో పనిచేస్తున్న కార్మికులకు తక్షణమే జీతాలు మంజూరు చేయాలి.

-ఐటి డిగ్రీ వివిధ రకాల చదువులు చదివిన వారిని కూడా లేబర్ పనులు చేయించడం దారుణం.
-ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి నాగన్న





ఆంధ్రప్రగతి నంద్యాల జనవరి 07:
జయరాజ్ ఇస్పాట్ స్టీల్ ప్లాంట్ లో పనిచేస్తున్నటువంటి కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి నాగన్న సిఐటి మండల నాయకులు వి సుధాకర్ పాల్గొన్నారు వారు మాట్లాడుతూ గత రెండు నెలల క్రితం గ్రామస్తులు రైతులు చదువుకున్న యువతతో పరిశ్రమ ముందు ధర్నా చేపట్టి జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం ఇవ్వడంతో స్థానిక యువతకు 100 మందికి పైగా ఉద్యోగాలు ఇచ్చారని అయితే ఒకటో తారీకు దాటి 7 రోజులు అయిపోయినా ఇంతవరకు జీతాలు ఇవ్వకపోవడం బాధాకరమైన విషయమని ఆవేదన వ్యక్తం చేశారు ఇచ్చే జీతం 15,000 వేలు అయితే వాటిలో 3 .4 వేల రూపాయలు కటింగ్ చేసి 11 12 వేల రూపాయలు మాత్రమే ఇస్తున్నారని కార్మికులు ఆందోళన చెందుతున్నారని అన్నారు వాటికి తోడు రోజు ఓర్వకల్లు గ్రామం నుండి పరిశ్రమ వద్దకు రావడం కోసం ఎటువంటి వాహనం గాని బైకులు తెచ్చుకున్న వారికి పెట్రోల్ గానీ ఇవ్వడం లేదు దీనివల్ల ఇచ్చేజితం ఏమాత్రం సరిపోక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా పరిశ్రమ యాజమాన్యం ఉన్నతాధికారులు స్పందించి మూడో వ్యక్తి ద్వారా ఉద్యోగాలు కాకుండా కంపెనీ నే డైరెక్టుగా ఉద్యోగాలు ఇచ్చి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు తక్షణమే కార్మికులకు జీతాలు మంజూరు చేసి వారికి రావడానికి పోవడానికి బస్సులు ఏర్పాటు చేసి తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో అన్ని ప్రజా సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ పరిరక్షణ కొరకై పోరాడుదాం




**కర్నూలు** జనవరి 7,ఆంధ్ర ప్రగతి : ఆర్టీసీ రంగ పరిరక్షణ కొరకు పోరాడుదాం సి.ఐ.టి.యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి అంజిబాబు స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి జె .దివాకర్ ఎస్ .డబ్ల్యు. ఎఫ్ రీజినల్ కార్యదర్శి రాయుడు పిలుపునిచ్చారు స్థానిక కార్మిక కర్షక భవన్ నందు ఎస్ .డబ్ల్యు.ఎఫ్ యూనియన్ 2025 సంవత్సరపు నూతన డైరీ ఆవిష్కరించారు. సందర్భంగా మాట్లాడుతూ ఆర్టీసీ పరిరక్షణ కొరకు ప్రతి కార్మికుడు ఐక్య ఉద్యమాలు చేయవలసిన అవసరం ఉందని అన్నారు .చాప కింద నీరులా ఆర్టీసీని ప్రైవేటు వరం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే హైర్ బ స్ రూపంలో ప్రైవేటీకరణ జరిగిందని మళ్లీ ఇప్పుడు ఎలక్ట్రిక్ బస్సుల రూపంలో మరింత ప్రైవేటీకరణ చేయడం కోసం ప్రయత్నం చేస్తున్నారని అన్నారు ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే నిర్వహించే విధంగా ఒత్తిడి తీసుకొని రావడానికి అన్ని కార్మిక సంఘాలు ఉద్యమించవలసిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు ఆర్టీసీలో పని చేస్తున్న కాంట్రాక్టు ఔర్సోర్సింగ్ కార్మికులకు చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారని అన్నారు. పని భద్రత లేదని ఆర్టీసీలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు ఔట్సోర్సింగ్ కార్మికులు అభద్రతాభావంలో ఉన్నారని తెలిపారు .కాంట్రాక్ట్ కార్మికులు అందరినీ రెగ్యులర్ చేయడానికి ప్రభుత్వం కృషి చేయాలని వారు డిమాండ్ చేశారు .రాబోవు కాలంలో ఆర్టీసీ లో పనిచేస్తున్న ఉద్యోగులు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎస్ డబ్ల్యు.ఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని తెలియజేశారు.

# నంద్యాల జిల్లా స్థాయి పోటీల విజేతలకు జ్ఞాపికల బహుకరణ.





ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 7: నంద్యాల పట్టణంలోని శ్రీ రామ కృష్ణ డిగ్రీ కళాశాల, నంద్యాల లో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని యువజన సర్వీసుల శాఖ - సెట్కూరు ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ నంద్యాల బ్రాంచ్ సహకారంతో ఆదివారం నిర్వహించిన నంద్యాల జిల్లా స్థాయి పోటీల బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం జరిగినది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డా!! జి. రామ కృష్ణా రెడ్డి మాట్లాడుతూ స్వామి వివేకానంద జీవించినది కేవలం 39 సంవత్సరాలు మాత్రమే అయినా ప్రపంచ వ్యాప్తంగా ఎంతో పేరు తెచుకొన్నారని, భారత దేశ ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పారని, భారతదేశం మళ్ళీ తన ప్రాచీన ఔన్నత్యాన్ని పొందాలని ఆశించిన వారిలో ముఖ్యులు స్వామి వివేకానంద.అని, వారి జీవితాన్ని ప్రతి ఒక్కరు ఆదర్శం గా తీసుకోవాలని కోరారు. తదుపరి జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీ సోమ శివా రెడ్డి, శాంతినికేతన్ స్కూల్ కరెస్పాండంట్ సుధాకర్, కళా శాల ప్రిన్సిపాల్ శ్రీ సుబ్బయ్య మరియు నంద్యాల రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ పర్ల దస్తగిరి మొదలగు వారు మాట్లాడుతూ వివేకానంద రామకృష్ణ మఠాన్ని స్థాపించి ప్రజలను ఆధ్యాత్మిక చింతన పెంపొందించేందుకు కృషి చేసారని . ముఖ్యం గా యువత ఎలా ఉండాలో, ఎలా వృద్ధి లోకి రావాలో చేసిన సూచనలు, సూక్తులను యువత ఆచరణ లో పెట్టి విజయం సాధించాలని కొరారు. స్వామి వివేకానంద సేవల కు గుర్తుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం జనవరి 12 ను జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకొంటూ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్థాయని , అందులో భాగంగానే నంద్యాల జిల్లాలో ఆదివారం 15 నుంచి 29 సంవత్సరాల యువతకు ఆదివారం వివిధ అంశాలలో పోటీలు నిర్వహించడమైనదని తెలిపారు. తదుపరి వ్యాసరచన, వకృత్వం, డ్రాయింగ్, క్విజ్ పోటీలలో మొదటి మూడు స్థానాలలో నిలిచినా విజేతలకు మెమెంటో మరియు ప్రశంసా పత్రాలు బహుకరించడమైనది. ఈ కార్యక్రమంలో క్రీడా భారతి జిల్లా కార్యదర్శి నిమ్మకాయల సుధాకర్, సెట్కూరు కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీ శ్యాం బాబ, కళాశాల లెక్టరర్ శ్రీమతి లలితా సరస్వతి మరియు ఇతర అధ్యాపకులు, వివేకానంద సొసైటీ సభ్యులు దమాం శంకర్, నాగేంద్ర మొదలగు వారు పాల్గొన్నారు.

# చైనా జలఖడ్గంపై దృష్టి పెట్టాల్సిందే!

చైనా ఎప్పటికప్పుడు కొత్త ఎత్తులు వేస్తూనే ఉంటుంది. పొరుగు దేశాలను గుప్పిట్లో ఉంచుకోవడం, ఎదుగుతున్న దేశాలకు ఎసరు పెట్టడం దాని లక్ష్యంగా ఉంది. కరోనాతో ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన చైనా తన మనుగడ, పెత్తనం కోసం ఎంతకైనా తెగిస్తుందని రుజువు చేసింది. తాజాగా హెచ్ఎంపివి వైరస్ కూడా ఇలాంటిదే. కరోనా సమయంలోనూ తమకు సంబంధం లేదని బుకాయించింది. అలాగే ఇప్పుడీ కొత్త వైరస్‌పైనా ప్రపంచాన్ని బుకాయిస్తోంది. ఎలాంటి ప్రాణాంతకం కాదని చెబుతోంది. చైనా తన మార్కెట్ పరిధిని పెంచుకునే ప్రయత్నంలో ఎలాంటి దురాగతాలకైనా పాల్పడుతుందనడానికి ఇవి నిదర్శనాలు. ఇకపోతే ఇప్పుడు చైనాతో అతిపెద్ద ముప్పు ఏర్పడబోతోంది. భారత్, నేపాల్‌లతో చైనా తన సరిహద్దుల ముక్కోణపు కూడలికి బాగా దగ్గరగా యార్లుంగ్ జాంగ్బో నదిపైన, గంగా ఉపనదిపైన టిబెట్‌లో కొత్త డ్యామ్‌ను నిర్మిస్తున్నదని వార్తలు వచ్చాయి. ఈ వార్త కొన్ని సంవత్సరాలుగా వివిధ వార్తా పత్రికల్లో ప్రచురితమైంది. నిజానికి ఈ డ్యామ్ నిర్మాణం జరిగితే భారత్ భద్రతకు తీవ్ర ముప్పు ఉందన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ క్రమంలో అలాంటిదేమీ లేదని తాజాగ ఆచైనా ప్రకటించింది. దీంతో భారత్‌కు ఎలాంటి ఉపద్రవం రాదని న మ్మబలికింది. చైనా ప్రభుత్వం బ్రహ్మపుత్రకు టిబెట్ పేరు అయిన యార్లుంగ్ జాంగ్బో నది దిగువ పరివాహక ప్రాంతాల్లో ఒక జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆమోదించింది. జల విద్యుత్ ప్రాజెక్టు యార్లుంగ్ జాంగ్బో నది దిగువ పరివాహక ప్రాంతంలో ఉంటుంది. హిమాలయ ప్రాంతంలో ప్రధాన ఇరుకైన లోయలో డ్యామ్ నిర్మాణం జరుగుతుంది. అక్కడ నది నాటకీయంగా మలుపు తీసుకుని అరుణాచల్ ప్రదేశ్‌లోకి ప్రవహించి, చివరగా బంగ్లాదేశ్‌కు చేరుకుంటుంది. ఆ డ్యామ్ చైనాకు నదీ ప్రవాహంపై నియంత్రణాధికారం కల్పిస్తుందని, ప్రాజెక్టు స్థాయి కారణంగా సరిహద్దు ప్రాంతాలను వరదల్లో ముంచెత్తేందుకు అవకాశం ఇస్తూ, సంక్షోభ సమయాల్లో అధిక మొత్తంలో నీటి విడుదలకు వీలు కల్పిస్తుందని భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. కానీ, బ్రహ్మపుత్ర నదిపై చైనా భాగంలో డ్యామ్ నిర్మాణాన్ని ఆమోదించాలన్న తన నిర్ణయాన్ని చైనా సమర్థించుకున్నది. ప్రపంచంలోనే అతిపెద్ద డ్యామ్‌ను టిబెట్‌లో బ్రహ్మపుత్ర నదిపై నిర్మించాలన్న చైనా యోచనపై భయాందోళనలు అనవసరమని చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ డిసెంబర్ 27న అన్నారు.మెగా ప్రాజెక్టు దిగువ నదీ పరివాహక దేశాలను ప్రభావితం చేయదని, దశాబ్దాల తరబడి



అధ్యయనాల ద్వారా వాటి భద్రత ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని సరి చేయడమైందని మావో నింగ్ స్పష్టం చేశారు, 137 బిలియన్ డాలర్ల ప్రాజెక్టును టెక్టోనిక్ ప్లేట్ సరిహద్దు పొడుగునా పర్యావరణపరంగా సున్నితమైన హిమాలయ ప్రాంతంలో నిర్మిస్తున్నారు. ప్రపంచంలోని అతిపెద్ద డ్యామ్ ప్రభావం పల్లపు ప్రాంతాలపై పడదని ఆమె చెప్పారు. ఆ డ్యామ్‌ను ఉపగ్రహ చిత్రాల ఆధారంగా దిగువ ప్రాంతాలకు నీటి ప్రవాహం నియంత్రణ కు చైనా ఉపయోగించుకోవచ్చు. చైనా ప్రభుత్వ ఆధ్వర్యంలోని జిన్‌హువా వార్తా సంస్థ ఉటంకించిన అధికార ప్రకటన ప్రకారం, తుదకు 2024 డిసెంబర్ 25న అన్ని సందేహాలను పరిహరిస్తూ వెలువరించింది. ఇప్పుడు భారత్ అభ్యంతరం చెప్పడంతో అంతగా భయపడాల్సిన అవసరం లేదని అంటోంది. సీమాంతర నదుల అభివృద్ధి పట్ల చైనా ఎల్లప్పుడూ బాధ్యతాయుతంగా ఉంటున్నట్లు, టిబెట్‌లో జలవిద్యుత్ అభివృద్ధిపై దశాబ్దాల పాటు అధ్యయనం చేసినట్లు, ప్రాజెక్టు భద్రతకు, పర్యావరణ, వాతావరణ పరిరక్షణకు సముచిత చర్యలు తీసుకున్నట్లు మావో నింగ్ చెబుతున్నా నమ్మశక్యంగా లేవు. భారత సరిహద్దుకు సమీపంగా టిబెట్‌లో బ్రహ్మపుత్ర నదిపై 137 బిలియన్ యుఎస్ డాలర్లు విలువ చేసే భూగ్రహంపై అతిపెద్ద మౌలిక వసతుల ప్రాజెక్టుగా పేర్కొంటున్న ప్రపంచంలోనే ప్రతిపాదిత అతిపెద్ద డ్యామ్ నదీ పరివాహక దేశాలు భారత్, బంగ్లాదేశ్‌లలో ఆందోళనలు కలిగిస్తోంది. డ్యామ్‌పై మొత్తం పెట్టుబడి ఒక ట్రిలియన్ యువాన్లు (137 బిలియన్ డాలర్లు) దాటిపోగలదు. ప్రపంచంలోనే అతిపెద్దదిగా పరిగణిస్తున్న చైనా సొంత త్రీ గార్జెస్ డ్యామ్ సహా ఈ గ్రహంపై ఏ ఇతర ఒక్క మౌలికవసతుల ప్రాజెక్టు ఖర్చును మరుగుజ్జును చేస్తుంది. హిమాలయ పర్వత ప్రాంతంలో ఒక భారీ లోయలో డ్యామ్‌ను నిర్మించడమన్నది పొరుగున ఉన్న మనపై జలయుద్ధ ట్యాంకును ఎక్కు పెట్టడమే. కైలాస శిఖరం నుంచి టిబెట్ మీదుగా భారత్, బంగ్లాదేశ్‌లకు పేర్ల మార్పుతో ప్రవహిస్తున్న నదిపై మెగా డ్యామ్‌ల నిర్మాణం గురించి పోటాపోటీగా వ్యవహరిస్తున్నా రెండు దేశాలు సీమాంతర నదులకు సంబంధించిన వివిధ అంశాలను చర్చించేందుకు 2006లో నిపుణుల స్థాయి యంత్రాంగం ను ఏర్పాటు చేశాయి. దాని కింద వరద కాలాల్లో బ్రహ్మపుత్ర నది, స్లటెజ్ నదికి సంబంధించి జలప్రవాహ సమాచారాన్ని భారత్‌కు చైనా అందజేస్తున్నది. సరిహద్దు అంశానికి సంబంధించి భారత, చైనా ప్రత్యేక ప్రతినిధులు ఎన్ఎస్ఎ అజిత్ దోవల్, చైనా విదేశాంగ శాఖ మంత్రి వాంగ్ యి మధ్య డిసెంబర్ 18న బీజింగ్‌లో జరిగిన చర్చల్లో సీమాంతర నదుల డేటా పంచుకోవడమైంది. సీమాంతర దేశాలపై దూకుడుగా వ్యవహరించేందుకు తన డ్యామ్‌లను ఉపయోగించుకుంటున్న చరిత్ర చైనాది. ఏడాది పొడుగునా వర్షపాతంలో గణనీయమైన పెరుగుదల ఉన్నది. జూలై, సెప్టెంబర్ మధ్య గరిష్ఠంగా ఉంటుంది. బ్రహ్మపుత్ర నది రెండు అధిక నీటిమట్టం సీజన్‌లను చూస్తుంటుంది. ఈ క్రమంలో బ్రహ్మపుత్ర ద్వారా నీటిని ఒక్కసారిగా వదిలితే అది భారత్‌ను ముంచెత్తే ప్రమాదం ఉందన్న ఆందోళన వస్తోంది. దీంతో దీనిపై భారత్ గట్టిగానే వ్యతిరేకిస్తున్నా..అడ్డుకోవడమే మంచిది.

# ఆశారాం బాపుకు మధ్యంతర బెయిల్ మంజూరు



న్యూఢిల్లీ, జనవరి 7,ఆంధ్ర ప్రగతి : ఆధ్యాత్మిక గురువు ఆశారాం బాపుకు సుప్రీంకోర్టు మంగళవారం మధ్యంతర బెయిల్ మంజూరీ చేసింది. ఆరోగ్యం క్షీణిస్తున్న నేపథ్యంలో మార్చి 31వ తేదీ వరకు ఆయనకు బెయిల్ ఇచ్చారు. మెడికల్ గ్రౌండ్స్ మీద 86 ఏళ్ల ఆశారాం బాపుకు బెయిల్ ఇస్తున్నట్లు కోర్టు తెలిపింది. జస్టిస్ ఎంఎం సుంద్రేశ్, జస్టిస్ రాజేశ్ బిందాల్‌తో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలను పాస్ చేసింది. ఆశారాం బాపు తరపున సీనియర్ న్యాయవాది దేవదత్త కమాత్ వాదించారు. ఆయనతో పాటు అడ్వకేట్లు రాజేశ్ గులాబ్ ఇనాందార్, శాశ్వత్ ఆనంద్ కూడా ఉన్నారు. ఆశారాం బాపు అసలు పేరు అసుమల్ సిరుమలాని హర్పలని. జోద్‌పూర్‌లోని అతన ఆశ్రమంలో ఓ టీనేజ్ అమ్మాయిని రేప్ చేసిన ఘటనలో అతన్ని అరెస్టు చేశారు.జోద్‌పూర్ కేసులో బెయిల్ దొరికినా.. మరో రేప్ కేసులో అతని పేరు ఉన్న కారణంగా ఇప్పుడే అతను జైలు విడిచి బయటకు రాలేరు. 2013లో గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఓ మహిళను కూడా లైంగికంగా వేధించినట్లు ఆశారాంపై ఆరోపణలు ఉన్నాయి.

# ఢిల్లీ ఎన్నికలకు మోగిన నగారా

**10న నోటిఫికేషన్ విడుదల**

**17 వరకు నామినేషన్ల స్వీకరణ**

**20 వరకు నామినేషన్ల ఉపసంహకరణ**




న్యూఢిల్లీ,జనవరి 7,ఆంధ్ర ప్రగతి : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగింది. కేంద్ర ఎన్నికల సంఘం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి 23తో ప్రస్తుత అసెంబ్లీ గడవు ముగుస్తుండటంతో ఆలోపే నూతన ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం కోసం కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఢిల్లీ అంతటా ఒకే విడతలో ఫిబ్రవరి 5న పోలింగ్ నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. ఫిబ్రవరి 8న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నట్లు పేర్కొంది. జనవరి 10న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. జనవరి 17 వరకు నామినేషన్‌లు స్వీకరించనున్నారు. జనవరి 20 వరకు నామినేషన్‌ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. షెడ్యూల్ విడుదల సందర్భంగా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ మాట్లాడుతూ.. ఈవీఎంలపై పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండటంపై క్లారిటీ ఇచ్చారు. ఓటర్ లిస్ట్ ట్యాంపరింగ్ జరిగిందన్న ఆరోపణలను ఈసీ తోసిపుచ్చింది. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపింది. ఈవీఎంలను ఎవరూ ట్యాంపరింగ్ చేయలేరని స్పష్టం చేసింది. గత ఏడాది ఎన్నికలను విజయవంతంగా నిర్వహించామని గుర్తుచేసింది. దేశంలో ఓటర్ల సంఖ్య 99 కోట్లు దాటిందని, మహిళా ఓటర్ల సంఖ్య 48 కోట్లు దాటిందని సీఈసీ రాజీవ్ కుమార్ చెప్పారు. ఈ ఏడాది తొలి ఎన్నికలు ఢిల్లీలో జరగబోతున్నాయని అన్నారు. ఢిల్లీలో అన్ని ప్రాంతాల ఓటర్లు ఉంటారని పేర్కొన్నారు. ఈవీఎంల ట్యాంపరింగ్ ఆరోపణలు సీఈసీ రాజీవ్‌కుమార్ ఖండించారు. ఈవీఎంలతోనే ఫలితాలు పారదర్శకంగా ఉంటాయని, ఈవీఎంల రిగ్గింగ్ జరిగినట్లు ఇంతవరకు ఎక్కడా నిరూపణ కాలేదని ఆయన తెలిపారు. ఈవీఎంల రిగ్గింగ్ సాధ్యం కాదని చెప్పారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా ఇదే తనకు చివరి ప్రెస్ మీట్ అని సీఈసీ చెప్పారు. ఓటింగ్ శాతంపై కొందరు అనుమానాలు వ్యక్తం చేస్తుండటంపై కూడా సీఈసీ స్పందించారు. పోలింగ్ రోజు సాయంత్రం 6 గంటలకు కచ్చితమైన పోలింగ్ శాతం వెల్లడించడం సాధ్యం కాదని అన్నారు.

# పడి లేస్తేనే విజయం సాధ్యం : పాలిటెక్ ఫెస్ట్‌లో మంత్రి లోకేశ్



విజయవాడ,జనవరి 7,ఆంధ్ర ప్రగతి : టెక్ ఫెస్ట్ ఇక్కడితో ఆగకూడదు.. జీవితంలో ఏదైనా సాధించడానికి ఎన్నిసార్లు పడినా లేచి నిలబడాలని మంత్రి నారా లోకేష్ తెలిపారు. క్రికెట్, కారు, బిర్యానీ తనకు నచ్చేవని అన్నారు. ఏపీ ప్రభుత్వ ప్రోత్సాహంతో అద్భుతమైన ఐడియాలు ఇవాళ ఈ ఫెస్ట్‌లో చూశానన్నారు. గ్రామాల్లో కూడా అద్భుతమైన సాంకేతికత ఉందని చెప్పారు. మేడ్ ఇన్ ఇండియా అని ప్రధాని చెప్పిన మాట చాలా ముఖ్యం అని పేర్కొన్నారు. లబ్బీపేటలోని ఎస్.ఎస్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన పాలిటెక్ ఫెస్ట్ 2024-25 కార్యక్రమంలో విద్య, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. నిర్వాహకులు ఏర్పాటు చేసిన 24 స్టాల్స్‌ను లోకేష్ సందర్శించారు. ప్రతి స్టాల్ దగ్గర ప్రాజెక్టు వివరాలు తెలుసుకున్నారు. అనంతరం.. విద్యార్థుల పరిజ్ఞానం అడిగి తెలుసుకుంటూనే వారికి సూచనలిచ్చారు. స్టాల్స్ పెట్టిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇచ్చారు. స్కిల్ డెవలప్మెంట్‌లో భాగంగా ఇలాంటి టెక్ ఫెస్ట్ లను మరింతగా ప్రోత్సహిస్తామని మంత్రి లోకేష్ నిర్వాహకులతో చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. 2018లో అప్పటి సీఎం చంద్రబాబు ఈ టెక్ ఫెస్ట్ ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ ఒకొక్క జిల్లాకి ఒకొక్క ప్రాధాన్యత ఇచ్చాం.. రాష్ట్ర ప్రభుత్వంలోని అనేక శాఖల్లో పైలట్ ప్రాజెక్టులు చేసేలా విద్యార్థుల కోసం జీఓ తెస్తామని తెలిపారు. జీఏడీలో కచ్చితంగా టెక్నాలజీ వినియోగించేలా తాను మాట్లాడతానన్నారు. డేర్ టూ డ్రీమ్, స్ట్రైవ్ టూ అచ్చీవ్ అని చంద్రబాబు చెప్పేవారని మంత్రి లోకేష్ తెలిపారు.

# 8న ప్రయాగ్ రాజ్ కు శ్రీవారి కళ్యాణ రథం



జనవరి 7,ఆంధ్ర ప్రగతి : ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ రాజ్(అలహాబాద్) వద్ద జనవరి 13 నుండి ఫిబ్రవరి 26వ తేది జరగనున్న మహా కుంభమేళాలో తిరుమలేశుడి నమూనా ఏర్పాటు చేయనున్నట్టు టీటీడీ తెలిపిన సంగతి తెలిసింది. తిరుమల అన్నమయ్య భవన్ లో టీటీడీ ఈవో. జే.శ్యామలరావు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ%ప్రయాగ్‌రాజ్‌లోని సెక్టార్ 6, భజరంగ్ దాస్ రోడ్డులోని నాగవాసుకి ఆలయ సమీపంలో ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం కేటాయించిన 2.89 ఎకరాల్లో శ్రీవారి నమూనా ఆలయ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉత్తరాది భక్తులు శ్రీవారి వైభవాన్ని సంతృప్తిగా తిలకించేలా తిరుమల తరహాలో స్వామివారి కైంకర్యాలు, ఉత్సవాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రతిరోజు తిరుమల తరహాలో నిత్యం సుప్రభాతం నుండి ఏకాంత సేవ వరకు అన్ని సేవలు నిర్వహిస్తామన్నారు.



# సుప్రీంను ఆశ్రయించిన కెటిఆర్

## నేడోరేపో విచారణకు వచ్చే అవకాశం

హైదరాబాద్,జనవరి 7,ఆంధ్ర ప్రగతి : ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మాజీ మంత్రి కేటీఆర్ వేసిన క్వాష్ పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు మంగళవారం కొట్టివేయడంతో ఆయన సుప్రీంకోర్టుకు వెళ్లారు. బీఆర్ఎస్ న్యాయవాదుల బృందం కేసును సుప్రీంకోర్టులో ÷ల్ చేసింది. బుధవారం లేదా గురువారం కేసు విచారణకు వచ్చే అవకాశం ఉందని కేటీఆర్ తరఫు న్యాయవాదులు చెబుతున్నారు. ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో ఏసీబీ తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ హైకోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే దీనిపై విచారణ చేసిన కోర్టు తీర్పును రిజర్వ్ చేసింది, ఇవాళ తాజాగా ఆయన వేసిన క్వాష్ పిటిషన్‌ను రద్దు చేస్తూ తీర్పు చెప్పింది. అంతేకాకుండా అంతకుముందు కేటీఆర్‌ను అరెస్టు చేయవద్దంటూ రెండుసార్లు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సైతం న్యాయస్థానం ఎత్తివేసింది. దీంతో కేటీఆర్‌ను అరెస్టు చేసే అవకాశాలు ఉన్నట్లు వార్తలు గుప్పుమన్నాయి. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టును కేటీఆర్ ఆశ్రయిచారు. మరోవైపు సుప్రీంకోర్టును కేటీఆర్ ఆశ్రయిస్తారని ముందుగానే పసిగట్టిన తెలంగాణ ప్రభుత్వం ఆయన కంటే ముందే ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ వేసింది. తమ వాదనలు వినకుండా కేటీఆర్ పిటిషన్‌పై ఎటువంటి నిర్ణయం తీసుకోవద్దంటూ సర్కార్ కేవియట్ దాఖలు చేసింది. దీంతో సుప్రీంకోర్టును కేటీఆర్ ఆశ్రయించినప్పటికీ వెంటనే మధ్యంతర ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశాలు తక్కువగా ఉండనున్నాయి. తెలంగాణ ప్రభుత్వ వాదనలు విన్న తర్వాతే సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుంది.

# మోడీ పర్యటన సందర్భంగా భారీగా ఏర్పాట్లు

## స్వయంగా పరిశీలించిన హోంమంత్రి అనిత






విశాఖపట్నం,జనవరి 7,ఆంధ్ర ప్రగతి :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం రానున్నారు. విశాఖలో పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేయనున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో

ఏపీ ప్రభుత్వం బహిరంగ సభ, రోడ్ షో ఏర్పాటు చేసింది. దీనికి సంబంధించి అధికారులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. పోలీసులు సైతం భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. సభా ఏర్పాటుకు సంబంధించి పనులు చకాచకా సాగుతున్నారు. ఈ సందర్భంగా హోంమంత్రి వంగలపూడి అనిత, పలువురు ఎమ్మెల్యేలు, కూటమి నేతలు, ప్రభుత్వ ఉన్నతాధికారులు సభా ఏర్పాట్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ..'కూటమి ప్రభుత్వం ఘన విజయం సాధించిన తర్వాత తొలిసారిగా విశాఖకు ప్రధాని మోదీ వస్తున్నారు. ప్రధాని పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లూ పూర్తి అయ్యాయి. భద్రతాపరంగా ఎటువంటి ఇబ్బందులూ రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. కొన్ని లక్షల కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని శంకుస్థాపన చేస్తారు. ఇదంతా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రధాని ఇస్తున్న బహుమతి. అందుకు ప్రతిఒక్కరూ మోదీకి అభినందలు తెలియజేయాలి. ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను రాష్ట్ర ప్రజలందరూ ఆశీర్వదించాలి. రేపు నిర్వహించే కార్యక్రమానికి ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని' కోరారు.

విశాఖపట్నానికి బుధవారం వస్తున్న ప్రధాని మోదీ ఏకంగా రూ.2 లక్షల కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేయనున్నారు. విశాఖపట్నం సమీపం పూడిమడక వద్ద జాతీయ హరిత హైడ్రోజన్ మిషన్ కింద మొదటి గ్రీన్ హైడ్రోజన్ హబ్‌కు ప్రధాని శంకుస్థాపన చేస్తారు. అత్యాధునిక ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ప్రాజెక్టుకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం దాదాపు రూ.1.85 లక్షల కోట్ల పెట్టుబడి పెడుతున్నారు. 2030 నాటికి శిలాజేతర ఇంధన సామర్థ్యం 500 గిగావాట్ల లక్ష్యాన్ని సాధించడానికి గ్రీన్ హైడ్రోజన్ హబ్ ఎంతగానో ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

లాగే ఏపీలో చేపడుతున్న రూ.19,500 కోట్ల విలువైన రైల్వే, రోడ్డు ప్రాజెక్టులకు సంబంధించి కొన్ని పనులకు ప్రధాని శంకుస్థాపన చేయనుండగా.. మరికొన్నింటిని ప్రారంభిస్తారు. విశాఖ దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయానికి సైతం ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నారు. అలాగే మరికొన్ని ఇతర ప్రాజెక్టులను ప్రధాని జాతికి అంకితం చేయనున్నారు. మరోవైపు అనకాపల్లి జిల్లా నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్క్, తిరుపతి జిల్లాలో చెన్నై- బెంగళూరు పారిశ్రామిక కారిడార్ పరిధిలోని కృష్ణపట్నం క్రిస్ సిటీకి ప్రధాని మోదీ శంకుస్థాపన చేస్తారు. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ కింద క్రిస్ సిటీని గ్రీన్ ఫీల్డ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు రూ.10,500 కోట్ల పెట్టుబడులను ఆకర్షించనున్నారు.

# పార్టీ కోసం పనిచేసిన వారికి ప్రాధాన్యమిస్తాం

## నామినేటెడ్ పోస్టులపై మంత్రి లోకేశ్ కీలక వ్యాఖ్యలు



జనవరి 7,ఆంధ్ర ప్రగతి :

టీడీపీలో నామినేటెడ్ పదవుల కోసం ఎదురుచూస్తున్న నేతలపై మంత్రి లోకేశ్ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ కోసం పనిచేసిన వారికి ప్రాధాన్యమిస్తామని చెప్పిన మంత్రి, మరో నెల రోజుల్లో పదవులను భర్తీ చేస్తామని తెలిపారు. అయితే వరుసగా రెండు సార్లు పదవులు తీసుకున్న నేతలు ఈ విడత ఖాళీగా ఉండాలని సూచించారు. దీంతో త్వరలో జరిగే నామినేడెట్ పోస్టుల పందేరంలో సీనియర్లకు ఝలక్ ఇచ్చే పరిస్థితి కనిపిస్తోంది. పార్టీలో యువరక్తాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సీనియర్లు ఈ సారి ఖాళీగా ఉండాలని మంత్రి సూచించడం టీడీపీలో హాట్ టాపిక్ అవుతోంది. ఏపీలో టీడీపీకి సుదీర్ఘ చరిత్ర ఉంది. పార్టీ స్థాపించిన నుంచి చాలా మంది లీడర్లు పార్టీని అంటిపెట్టుకుని ఉన్నారు. అధిష్టానం ఆదేశాలను పాటిస్తూ పార్టీ కోసం పనిచేసే నేతలకు టీడీపీలో కొదవలేదు. ఇలాంటి వారంతా పార్టీ అధికారంలోకి రాగానే నామినేడెట్ పదవులను ఆశిస్తుంటారు. ప్రతిపక్షంలో ఉండగా, పార్టీ పదవుల్లో పనిచేసిన వారు, ఎన్నికల్లో పోటీ చేయడానికి అవకాశం లేనివారు ఇలా కొన్ని వందల మంది నామినేడెట్ పదవుల కోసం పోటీపడుతుంటారు. పార్టీ కూడా వీరందరికీ విడతల వారీగా అవకాశం ఇస్తుంటుంది. అయితే ఈ సారి నామినేడెట్ పదవుల భర్తీని వేగంగా భర్తీ చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు చాలా మంది సీనియర్లను వెయిటింగులో పెట్టారు. త్వరలో వారికి పదవులు వరిస్తాయని ఎదురుచూస్తున్న వేళ, యువనేత టీడీపీ ప్రధాన కార్యదర్శి లోకేశ్ బాంబ్ లాంటి వార్త చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా ఉండిలో పర్యటిస్తున్న మంత్రి లోకేశ్, నామినేడెట్ పదవులను నెల రోజుల్లో భర్తీ చేస్తామన్నారు. అయితే వరుసగా రెండు సార్లు పదవులు అనుభవిస్తున్నవారికి అవసరమైతే ప్రమోషన్ ఇస్తామని లేదంటే ఈ సారికి ఖాళీగా ఉండాలని సూచించారు. అంటే పార్టీలో పొలిట్ బ్యూరోతోపాటు ఇతర పదవుల్లో ఉన్న నేతలకు స్థాన చలనం తప్పదనే సంకేతాలిచ్చినట్లైంది. క్షేత్రస్థాయిలో పనిచేస్తూ సమర్థత చాటుకుంటున్న నేతలకు ప్రమోషన్ ఇస్తామని లోకేశ్ వివరించారు. అంటే పార్టీ పరమైన పదవుల్లో కొత్త వారికి ఎక్కువ అవకాశాలిచ్చే పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు నామినేడెట్ పదవుల విషయంలోనూ ఇదే సూత్రం అమలు చేస్తారని అంటున్నారు. దీంతో గతంలో పదవులు పొందిన వారికి ఈ సారి ఎలాంటి పదవీ దక్కే అవకాశాల్లేవంటున్నారు. పార్టీ ఆదేశిస్తే తాను గానీ, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కానీ సామాన్య కార్యకర్తల్లా పనిచేయాల్సిందేనని మంత్రి చెప్పారు. దీన్నిబట్టి పార్టీ పదవులను ఆశిస్తున్న సీనియర్లకు ఈ సారి ఝలక్ ఇచ్చే అవకాశాలు ఎక్కువ అంటున్నారు. కొత్తతరం కోటా కింద లోకేశ్ టీంలో పనిచేసే వారికి ప్రాధాన్యం దక్కనుందంటున్నారు.

# నేడు విశాఖకు ప్రధాని మోడీ

## ఏర్పాట్లను పరిశీలించిన పురంధేశ్వరి -విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ప్యాకేజీ వస్తుందని ఆశాభావం



విశాఖపట్టణం,జనవరి 7,ఆంధ్ర ప్రగతి :

విశాఖ స్టీల్ ప్లాంట్ పునరుద్దరణ కోసం మంచి ప్యాకేజీ కేంద్రం ప్రకటిస్తుందని బీజేపీ ఎంపి, పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. ఉక్కు ఉద్యోగుల జీతభత్యాల చెల్లింపులో ఇబ్బందులు ఉన్నాయన్న విషయం కేంద్రమంత్రి దృష్టికి తీసుకుని వెళతామని అన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ వల్ల జరిగే అభివృద్ధి నమూనాకు ఆంధ్రప్రదేశ్ ఉదాహరణ అని పురందేశ్వరి తెలిపారు. విశాఖలో ప్రధాని సభా వేదిక ఏర్పాట్లను బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేశారు. స్టీల్ ఎ÷-లాంట్‌కు త్వరలో కేంద్ర ఉక్కు మంత్రి కుమార స్వామి రివైవల్ ప్యాకేజీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది.. రూ.17 వేల కోట్లు రివైవల్ ప్యాకేజీ వచ్చే అవకాశం ఉందని అన్నారు. అమరావతికి రూ.15 వేల కోట్లు, పోలవరంకు రూ.12500, టాక్స్ డివల్యూషన్ కింద 7200, పంచాయతీ రాజ్ శాఖకు 4800 ఓఔఖీఇఉ÷ూ పెద్ద ఎత్తున నిధులు ఇచ్చి కేంద్రం సహకరించిందని పురందేశ్వరి తెలిపారు. రూ.6000 కోట్లతో జల్ జీవన్ మిషన్ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. మరోవైపు.. మోడీ సభలకు జన సమీకరణ అవసరం లేదని చెప్పారు.మరోవైపు.. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ దాడిపై పురందేశ్వరి స్పందించారు. కాంగ్రెస్ అప్రజాస్వామికంగా వ్యవరించిందని దుయ్యబట్టారు. బీజేపీ నేతలపై దాడి చేయడం ఖండిస్తున్నామన్నారు. చట్టపరంగా వ్యవహరించాలని డిమాండ్ చేస్తున్నామని పురందేశ్వరి తెలిపారు.ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం విశాఖకు వస్తున్నారు. పర్యటనలో భాగంగా.. ఎన్టీపీసీ ప్రాజెక్ట్, వైజాగ్ రైల్వే జోన్, జోనల్ హెడ్ క్వార్టర్ శంకుస్థాపన వంటి కార్యక్రమాలకు ప్రధాని శంఖుస్థాపన చేస్తారు. అంతేకాకుండా.. కొన్ని పూర్తి అయిన ప్రాజెక్ట్‌లను కూడా ప్రధాని ప్రారంభించనున్నారు. ప్రధాని పర్యటనకు ఏపీ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. మంత్రులు ప్రత్యేకంగా ప్రధాని టూర్ పై దృష్టి పెట్టారు. మంత్రి నారా లోకేష్ స్వయంగా వైజాగ్ వెళ్లి మరీ సమీక్ష నిర్వహించారు. మరోవైపు.. ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ వైజాగ్‌లో రోడ్ షో నిర్వహించనున్నారు.

# 2030 నాటికి 10 మిలియన్ల మందికి ఏఐ స్కిల్స్‌పై శిక్షణే లక్ష్యం

## సత్య నాదెళ్ల కీలక ప్రకటన: భారత్‌లో మైక్రోసాఫ్ట్ భారీ పెట్టుబడులు



జనవరి 7,ఆంధ్ర ప్రగతి :

మైక్రోసాఫ్ట్ సంస్థ భారత్‌లో 3 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడి పెట్టనున్నట్లు కంపెనీ ఛైర్మన్, సీఈఓ సత్య నాదెళ్ల ప్రకటించారు. క్లౌడ్ సేవలు, కృత్రిమ మేధ (ఏఐ) సామర్థ్యాలు, డేటా సెంటర్ల విస్తరణ వంటి రంగాల్లో ఈ పెట్టుబడిని వినియోగించనున్నట్లు ఆయన తెలిపారు. 2030 నాటికి 10 మిలియన్ల మందికి ఏఐ స్కిల్స్‌పై శిక్షణ అందించడమే ఈ పెట్టుబడితో సంస్థ ముందుకు తీసుకెళ్లే మరో ముఖ్య లక్ష్యంగా ఆయన వెల్లడించారు.సత్య నాదెళ్ల మంగళవారం నాడు బెంగళూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఈ కీలక ప్రకటన చేశారు. ప్రస్తుతం భారత్ పర్యటనలో ఉన్న ఆయన, సోమవారం నాడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏఐ రంగంలో భారత్‌ను ప్రపంచవ్యాప్తంగా ఉన్నత స్థానంలో నిలిపేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను నిలపాలన్న ప్రధాని మోదీ లక్ష్యాన్ని సాకారం చేసేందుకు మైక్రోసాఫ్ట్ తమ స్థాయిలో తోడ్పాటును అందిస్తుందని నాదెళ్ల స్పష్టం చేశారు.భారత నైపుణ్యాలపై తన ప్రత్యేక అభిప్రాయాలను వ్యక్తం చేసిన సత్య నాదెళ్ల, భారతీయ నిపుణులు కొత్త నైపుణ్యాలను అభ్యసించడంలో ప్రథమ స్థానంలో ఉన్నారని కొనియాడారు. లింక్డిన్ గణాంకాల ప్రకారం, ఏఐ స్కిల్స్‌ను తమ ప్రొఫైల్‌లో జోడించుకున్న వారి సంఖ్య గ్లోబల్‌గా 71 శాతం పెరిగినప్పటికీ, భారత్‌లో ఈ వృద్ధి 122 శాతం ఉందని నాదెళ్ల పేర్కొన్నారు. 2025 నాటికి 2 మిలియన్ల మందిని ఏఐ నిపుణులుగా తీర్చిదిద్దాలన్న 'అడ్వాంటేజ్ ఇండియా' కార్యక్రమ లక్ష్యాన్ని మైక్రోసాఫ్ట్ ముందుగానే పూర్తి చేయగలిగిందని తెలిపారు. ఇప్పుడు 2030 నాటికి 10 మిలియన్ల మందికి శిక్షణ ఇవ్వడం తదుపరి లక్ష్యమని ప్రకటించారు.భారత్‌లో 3 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడులు పెట్టడం సంస్థకు గర్వకారణమని, ఈ పెట్టుబడి దేశంలో ఏఐ ఆవిష్కరణలకు మరింత ఊతం కల్పిస్తుందని సత్య నాదెళ్ల చెప్పారు. ఇది భారత్‌లో టెక్నాలజీ రంగ అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# ప్లేయర్ ఆఫ్ ది మంత్ నామినేషన్స్ లో బుమ్రా !



%ఇటీవల ముగిసిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో ఆస్ట్రేలియాపై భారత స్టార్ బౌలర్, యార్కర్ కింగ్ జస్ప్రీత్ బుమ్రా అసాధారణ ప్రదర్శన కనబర్చాడు. బంతితో చెలరేగిన బుమ్రా%ొ% ఐదు టెస్టుల్లో 13.06 సగటుతో మొత్తం 32 వికెట్లు తీసి.. పలు రికార్డులను బద్దలు కొట్టాడు. ఈ క్రమంలో తాజగా ప్రతిష్టాత్మక ఐసిసి ప్లేయర్ ఆఫ్ ది మంత్ (డిసెంబర్) అవార్డుకు బుమ్రా ఎంపికయ్యాడు.బుమ్రాతో పాటు ఆసీస్ కెప్టెన్ పాట్ కమిన్స్, దక్షిణాఫ్రికా సీమర్ డేన్ ప్యాటర్సన్ కూడా పురుషుల ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డుకు నామినేట్ అయ్యారు.



# ఛాంపియన్స్ ట్రోఫీకి సిద్ధమైన శ్రేయాస్ అయ్యర్

వచ్చే నెల నుంచి ఛాంపియన్స్ ట్రోఫీ సందడి మొదలుకానుంది. టోర్నమెంట్ ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభమవుతుంది. దీని కోసం జట్లను ప్రకటించడానికి చివరి తేదీ జనవరి 12గా ఐసీసీ నిర్ణయించింది. ఈ ఐసీసీ టోర్నీకి భారత జట్టును కూడా త్వరలో ప్రకటించనున్నారు. కానీ, దేశవాళీ టోర్నీల్లో నిరంతరం రాణిస్తున్న ఆ ఆటగాడికి అందులో అవకాశం దక్కుతుందా అనేది పెద్ద ప్రశ్నగా మారింది. అతను ఇప్పటివరకు 5 టోర్నమెంట్లలో 1341 పరుగులు చేశాడు. అవును, ఇంతకుముందు గాయాలు, పేలవమైన ఫామ్‌తో ఆకట్టుకుంటోన్న శ్రేయాస్ అయ్యర్ గురించి మాట్లాడుతున్నాం. కానీ, 2024-25 దేశవాళీ సీజన్ బరిలోకి దిగిన శ్రేయాస్ అయ్యర్.. పరుగుల వర్షం కురిపిస్తున్నాడు. ఏది ఏమైనా వైట్ బాల్ క్రికెట్‌లో టీమిండియాకు శ్రేయాస్ అయ్యర్ ఫస్ట్ లైన్ ప్లేయర్. అతను ఇప్పుడు ఉన్న ఫామ్‌ను చూస్తుంటే, ఛాంపియన్స్ ట్రోఫీ 2025 కోసం దావా వేస్తున్నట్లేనని తెలుస్తోంది. అయ్యర్ ప్రస్తుతం విజయ్ హజారే ట్రోఫీలో ఆడుతున్నాడు. అక్కడ అతని బ్యాట్ పరుగులు చేయడం లేదు. విజయ్ హజారే ట్రోఫీలో ఇప్పటివరకు ఆడిన 5 ఇన్నింగ్స్‌ల్లో శ్రేయాస్ అయ్యర్ 325 సగటుతో 325 పరుగులు చేశాడు. ఈ సమయంలో అతను 2 అర్ధ సెంచరీలు సాధించాడు. ప్రస్తుత విజయ్ హజారే ట్రోఫీ సీజన్‌లో అతని అత్యుత్తమ స్కోరు 137 పరుగులుగా నిలిచింది. కానీ, ఇది కేవలం టోర్నీ మాత్రమే. ఇంతకు ముందు ఆడిన ఇతర టోర్నీల్లోనూ శ్రేయాస్ అయ్యర్ ఫామ్ ఇలాగే ఉంది. రంజీ ట్రోఫీ అయినా, అతను 4 మ్యాచ్‌ల్లో 5 ఇన్నింగ్స్‌లలో 90.40 సగటుతో 2 సెంచరీలతో సహా 452 పరుగులు చేశాడు. ఈ రెండు సెంచరీల్లో డబుల్ సెంచరీ కూడా ఉంది.రంజీతో పాటు, సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నమెంట్‌లో శ్రేయాస్ అయ్యర్ 8 ఇన్నింగ్స్‌లలో 188.52 స్ట్రైక్ రేట్‌తో 345 పరుగులు చేశాడు. ఈ సమయంలో, అయ్యర్ 1 సెంచరీ, 1 అర్ధ సెంచరీ సాధించాడు. శ్రేయాస్ అయ్యర్ దులీప్ ట్రోఫీలో 3 మ్యాచ్‌ల్లో 154 పరుగులు చేయగా, ఇరానీ ట్రోఫీలో 1 మ్యాచ్‌లో 65 పరుగులు చేశాడు. ఈ రెండు టోర్నీల్లోనూ అతడు సెంచరీ చేయలేదు. ఇప్పుడు దేశవాళీ క్రికెట్‌లో ఆడిన ఈ ఐదు టోర్నీల్లో శ్రేయాస్ అయ్యర్ చేసిన పరుగులను జోడిస్తే, అతని మొత్తం 1341 పరుగులు అవుతుంది. అయితే, ఈ సంఖ్య మరింత పెరగవచ్చు. ఎందుకంటే, విజయ్ హజారే ట్రోఫీలో శ్రేయాస్ అయ్యర్ ఆట కొనసాగుతోంది. విజయ్ హజారే ట్రోఫీ అనేది వైట్ బాల్ టోర్నమెంట్, అందులో అతను ప్రదర్శించిన ప్రదర్శన ఛాంపియన్స్ ట్రోఫీ 2025కి ఎంపికయ్యేలా చేస్తుందని తెలుస్తోంది.

# గాయత్రి జోడీ శుభారంభం



2025 సీజన్ తొలి బ్యాడ్మింటన్ టోర్నీలో భారత మహిళల స్టార్ డబుల్స్ జోడీ గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ శుభారంభం చేశారు. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో గాయత్రి-ట్రీసా ద్వయం 21-10, 21-10 తేడాతో స్థానిక షట్లర్లు ఒర్నిచా-సుకిత సువాచాయ్ (థాయిలాండ్) జంటను వరుస గేముల్లో చిత్తు చేసి టోర్నీలో ముందంజ వేశారు. 30 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించి రౌండ్-16కు (ప్రి క్వార్టర్ ఫైనల్స్ కు) అర్హత సాధించారు.మరోవైపు పురుషుల సింగిల్స్‌లో మాత్రం భారత్‌కు భారీ షాక్ తగిలింది. టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన యువ సంచలనం లక్ష్యసేన్ తొలి రౌండ్‌లోనే టోర్నీ నుంచి నిష్క్రమించాడు. తొలి రౌండ్‌లో లక్ష్యసేన్ 14-21, 7-21 తేడాతో చైనీస్ తైపీకి చెందిన యు జెన్ చేతిలో వరుస గేముల్లో చిత్తుగా ఓడాడు.

%మరో పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో హెచ్ఎస్ ప్రణయ్‌కి చేదు అనుభవం ఎదురైంది. బ్రయాన్ యంగ్ (కెనడా)తో జరిగిన మ్యాచ్ లో భారత స్టార్ ప్రణయ్ తొలి గేమ్‌ను 21-12తో గెలుచుకున్నాడు. తర్వాత రెండో గేమ్‌లో 9-11తో హెూరాహెూరీగా తలపడుతున్న సమయంలో స్టేడియం రూఫ్‌లో వాటర్ లీకేజ్ కారణంగా ఈ మ్యాచ్ మధ్యలోనే నిలిచిపోయింది. వీరు ఆడుతున్న కోర్ట్-3లో నీరు చేరడంతో రిఫరీలు మ్యాచ్‌ను నిలిపివేశారు. బుధవారం మ్యాచ్ మళ్లీ ఇక్కడి నుంచే ప్రారంభమవుతుంది.

# భారత్ లో అభిమానులు చాలా క్రేజీ

## ఆస్ట్రేలియా టెస్ట్ కెప్టెన్ పాట్ కమిన్స్

క్రికెటర్స్ కు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ఫ్యాన్స్ ఉండటం సహజమే. కొంతమంది ప్లేయర్స్ కైతే లేడీ ఫ్యాన్ ఫాలోయింగ్ కూడా కాస్త ఎక్కువగానే ఉంటుంది. ఆ ఆటగాళ్ల గ్లామర్ కు, ఆటతీరుకు.. అమ్మాయిలు ఫిదా అవ్వడంతో పాటు వారిపై విపరీతంగా క్రష్ ఫీలింగ్ ను పెంచేసుకుంటారు. వారితో ఒక్కసారి మాట్లాడితే చాలు, ఒక్క ఫొటో దిగితే చాలు అని తెగ ఆరాటపడిపోతుంటారు. అయితే తాజాగా 'డేట్ విత్ ఏ సూపర్ స్టార్' అనే షోలో పాల్గొన్న ఆస్ట్రేలియా టెస్ట్ కెప్టెన్ పాట్ కమిన్స్ తనపై ఉండే ఫీమేల్ అటెన్షన్ ను ఎలా డీల్ చేస్తాడో చెప్పుకొచ్చాడు. తనపై అమ్మాయిలు చూపించే క్రష్ ఫీలింగ్ ను తాను ఎలా ఫీల్ అవుతాడో తెలిపాడు. 'మీకు ఇండియాలో భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ముఖ్యంగా మహిళల్లో మీకు విశేష అభిమానగణం ఉంది. చాలా మంది అమ్మాయిలకు, మహిళలకు మీరంటే చాలా ఇష్టం. నాతో సహా నా బెస్ట్ ఫ్రెండ్, మిగతా మహిళలకు మీపై క్రష్ ఫీలింగ్ ఉంది. 'ఓ నువ్వు ప్యాట్ కమిన్స్ ను కలుస్తున్నావా. నేను జెలసీగా ఫీలవుతున్నా' అని నా ఫ్రెండ్ నాతో మెసేజ్ కూడా చేసింది. మీకు పెళ్లి అయిందని ప్రతిఒక్కరికీ తెలుసు. కానీ మీరు ఇంతమంది అమ్మాయిల అభిమానాన్ని, ప్రేమను ఎలా సంపాదించుకోగలిగారు' అని హెూస్ట్ సాహిబా బలి అడిగింది. దానికి కమిన్స్ ఆసక్తికరమైన సమాధానం చెప్పాడు. తనకు ఈ విషయాన్ని ఎక్కడి నుంచి మొదలుపెట్టాలో తెలియట్లేదని అన్నాడు. కేవలం తన పని మాత్రమే తాను చేస్తానని చెప్పుకొచ్చాడు. అంతకుమించి ఎక్కువ ఆలోచించనని వెల్లడించాడు. "దీని గురించి ఎక్కడి నుంచి మొదలుపెట్టాలో తెలీదు. కేవలం నా పని నేను చేసుకుంటూ ముందుకెళ్తాను అంతే. అంతకుమించి ఇంకేం లేదు" అని అన్నాడు. 'మీరు ఫీమేల్ అటెన్షన్ ను ఎలా ఆస్వాదిస్తారు' అని మళ్లీ అడగగా.. ఇండియాలో ఫ్యాన్స్ చాలా క్రేజీగా ఉంటారని చెప్పాడు కమిన్స్. "ఫన్నీగా చెబుతున్నాను. భారత్ లో అభిమానులు చాలా క్రేజీగా ఉంటారు. ప్లేయర్స్ దాదాపుగా ఎక్కువ సమయాన్ని తమ జట్టుతో పాటు హెూటల్ లోనే గడుపుతారు. ప్లేయర్స్ ఫ్యామిలీలు కూడా తమతో పాటే ఉంటాయి. కాబట్టి చాలా సందర్భాల్లో వేరే వాళ్లతో పర్సనల్ గా మాట్లాడటం కూడా కుదరదు." అని పేర్కొన్నాడు. కాగా, ఆస్ట్రేలియా జట్టు విషయానికొస్తే, బోర్డర్ గావస్కర్ ట్రోఫీని పదేళ్ల తర్వాత సొంతం చేసుకుంది. గత రెండు పర్యాయాలు ఆస్ట్రేలియాలో టీమిండియా 2-1తో సిరీస్‌ను దక్కించుకుంది. అయితే ఈసారి కూడా విజయంతోనే సిరీస్ ప్రారంభించినా, ఆ తర్వాత గాడి తప్పింది. దీంతో ఆస్ట్రేలియా గావస్కర్ ట్రోఫీని గెలవడంతో పాటు ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ ఫైనల్ 2025కు అర్హత సాధించింది. ఇప్పటికే దక్షిణాఫ్రికా ఫైనల్ చేరుకున్న సంగతి తెలిసిందే. దీంతో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్ల మధ్య ఇంగ్లాండ్‌లోని లార్డ్స్ వేదికగా ఫైనల్ జరగనుంది. రెండేళ్ల క్రితం జరిగిన తుది పోరులో ఆస్ట్రేలియా జట్టు టీమిండిను ఓడించి, ట్రోఫీని ముద్దాడింది. వరుసగా ఇప్పుడు రెండోసారి ఫైనల్ కు చేరింది.



# తమీమ్ ఇక్బాల్ అద్భుతమైన ఇన్నింగ్స్

## 48 బంతుల్లో 86 పరుగులతో అజేయ ఇన్నింగ్స్



బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం టీ20 లీగ్ హవా నడుస్తోంది. బంగ్లాదేశ్, పాకిస్థాన్‌తో సహా ప్రపంచంలోని అనేక మంది ఆటగాళ్ళు పాల్గొంటున్న టీ20 లీగ్ అక్కడ తుది స్థాయికి చేరుకుంది. జనవరి 6న బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్‌లో రెండు జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. అందులో ఒక జట్టు కెప్టెన్ 16 జట్లతో ఆడిన అనుభవం ఉంది. ఈ మ్యాచ్ ఫార్చ్యూన్ బరిషల్ వర్సెస్ దర్బార్ రాజ్‌షాహీ జట్టు మధ్య జరిగింది. ఫార్చ్యూన్ బారిసల్ కెప్టెన్ తమీమ్ ఇక్బాల్‌కు 16 జట్లతో ఆడిన అనుభవం ఉంది. ఈ మ్యాచ్‌లో తమీమ్ అనుభవం అతని జట్టుకు చాలా ఉపయోగకరంగా మారింది. దాని కారణంగా అతని జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తమీమ్ ఇక్బాల్ తన జట్టుకు ద్విపాత్రాభినయం చేసి ముందుండి నడిపించాడు. ఓపెనర్‌గా వచ్చిన అతను తన జట్టు కోసం మ్యాచ్‌ను ముగించాడు. అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడుతూనే, కెప్టెన్‌గా తన బాధ్యతను కూడా నెరవేర్చాడు. తమీమ్ ఇక్బాల్ రాజ్‌షాహీ జట్టుపై ఫార్చ్యూన్ బరిషల్‌కు సిక్సర్‌తో విజయాన్ని అందించాడు. ముందుగా బ్యాటింగ్ చేసిన రాజ్‌షాహి జట్టు ఫార్చ్యూన్ బరిషాల్‌పై 20 ఓవర్లలో 169 పరుగుల విజయలక్ష్యంతో నిర్దేశించుకుంది. దీనిని ఛేదించేందుకు బ్యాటింగ్ ప్రారంభించిన తమీమ్ ఇక్బాల్ 48 బంతుల్లో 86 పరుగులతో అజేయంగా ఇన్నింగ్స్ ఆడాడు. 179 కంటే ఎక్కువ స్ట్రైక్ రేట్‌తో ఆడిన అతని ఇన్నింగ్స్‌లో 11 ఫోర్లు, 3 సిక్సర్లు ఉన్నాయి. తమీమ్ బ్యాట్ నుంచి వచ్చిన మూడో సిక్సర్ జట్టు గెలుపు స్క్రిప్ట్‌ను రచించింది. బంగ్లాదేశ్ దిగ్గజ ఆటగాళ్లలో తమీమ్ ఇక్బాల్ పేరు కూడా ఉంది. అతను తన దేశం తరపున అత్యధిక పరుగులు, అత్యధిక అంతర్జాతీయ సెంచరీలు చేసిన బ్యాట్స్‌మెన్. బంగ్లాదేశ్ సీనియర్ జట్టు తరపున క్రికెట్ ఆడడమే కాకుండా, మరో 15 జట్లకు క్రికెట్ ఆడిన అనుభవం ఉంది. అందులో ఒకటి ఫార్చ్యూన్ బరిషల్.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



## ఆస్కార్ 2025.. ఉత్తమ చిత్రాల కేటగిరిలో ఐదు సినిమాలివే...



ఆస్కార్ 2025 97వ అకాడమీ అవార్డ్స్ ఈవెంట్ ( ఆస్కార్ 2025)కు కేవలం రెండు నెలల సమయం ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ ఈ ఏడాది ఆస్కార్‌లకు అర్హత సాధించిన 323 చలన చిత్రాల జాబితాను ప్రకటించింది. వీటిలో 207 సినిమాలు ప్రతిష్టాత్మకమైన ఉత్తమ చిత్రం కేటగిరీలో అర్హత సాధించాయి. ఈ జాబితాలో ఐదు భారతీయ సినిమాలు అర్హత సాధించడం విశేషం.

**భారతీయ సినిమాల జాబితా :**

కంగువ (తమిళం)
ఆడుజీవితం (ది గోట్ లైఫ్)-హిందీ
సంతోష్ (హిందీ)
స్వతంత్ర్య వీర్ సావర్కర్ (హిందీ)
All We Imagine as Light( మలయాళం-హిందీ)
Girls will be Girls (హిందీ-ఇంగ్లీష్)

ఈ నామినేషన్లకు ఓటింగ్ రేపటి నుంచి షురూ కానుంది. ఈ ప్రక్రియ జనవరి 12 వరకు ముగియనుంది. అకాడమీ ఫైనల్ నామినేషన్స్‌ను జనవరి 17న ప్రకటించనుంది. 97వ ఆస్కార్ అవార్డ్ ఈవెంట్-2025 మార్చి 2నలోని డాల్బీ థియేటర్‌లో జరుగనుంది. మరి ఈ జాబితా నుంచి ఏ సినిమా అయినా ఫైనల్ నామినేషన్‌లో చోటు సంపాదించుకుంటుందా..? అని భారతీయ సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## పెద్ద హీరో... చిన్న విలన్... మరో రిస్క్ చేస్తున్న సూర్య!

సూర్య కథానాయకుడిగా ఇటీవలే 'కంగువా' సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. టైటిల్ తోను... సూర్య లుక్ తోను అందరిలో ఆసక్తిని పెంచుతూ వచ్చిన ఈ సినిమా, ప్రేక్షకులను ఎంతమాత్రం మెప్పించలేకపోయింది. వినోదప్రధానమైన అంశాలకు దూరంగా వెళ్లిన ఈ సినిమా, నిర్మాతలకు భారీ నష్టాలను తెచ్చిపెట్టింది. అయితే సూర్య మాత్రం ఈ విషయాన్ని లైట్ తీసుకున్నాడు. ఆ తరువాత ప్రాజెక్టును చేసుకుంటూ వెళుతున్నాడు.'కంగువా' సినిమా రిజల్ట్ తరువాత సూర్య, తన నెక్స్ట్ ప్రాజెక్టు విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవడం ఖాయమనే ఒక టాక్ వచ్చింది. అయితే సూర్య ఈ ప్రాజెక్టు విషయంలో కూడా చాలా రిస్క్ తీసుకుంటూ ఉండటం ఆశ్చర్యం. సూర్య తాజా చిత్రం ప్రస్తుతం షూటింగు దశలో ఉంది. రెండో షెడ్యూల్ కి సంబంధించిన చిత్రీకరణకిగాను, చెన్నై లో ప్రత్యేకమైన సెట్లు వేస్తున్నారు. ఈ నెలంతా ఇక్కడే షూటింగు జరుగుతుందని అంటున్నారు.సాధారణంగా 'కంగువా' ఫ్లాప్ తరువాత పెద్ద డైరెక్టర్ తో సెట్స్ పైకి వెళ్లాలనే ఏ హీరో అయినా అనుకుంటాడు. కానీ ఇంతవరకూ స్టార్స్ తో సినిమా చేయని ఆర్ జె బాలాజీ దర్శకత్వంలో సూర్య ముందుకు వెళ్లడం విశేషం. ఇక ఈ సినిమాలో విలన్ గా చేస్తున్నది కూడా ఆర్ జె బాలాజీనే. అతను నటుడు కూడా అనే విషయం తెలిసిందే. హీరో - విలన్ ఇద్దరూ లాయర్లు కావడం మరో విశేషం. మరి ఈ సినిమాతో అభిమానులు ఆశించే హిట్ ను సూర్య ఎంతవరకూ ఇస్తాడనేది చూడాలి.




## థాయ్‌లాండ్‌కు పయనమైన రజనీకాంత్



తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ ప్రస్తుతం లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో కూలీ సినిమా చేస్తున్నాడని తెలిసిందే. ఈ మూవీ చిత్రీకరణ దశలో ఉంది. కాగా మంగళవారం తలైవా థాయ్‌లాండ్‌కు పయనమయ్యాడు. ఈ సందర్భంగా చెన్నై ఎయిర్‌పోర్టులో మీడియాతో మాట్లాడారు తలైవా. కూలీ 70 శాతం షూటింగ్ పూర్తయిందని చెప్పాడు. అంతేకాదు నెక్ట్స్ షెడ్యూల్ జనవరి 13న మొదలు కానుందని.. ఈ షెడ్యూల్ జనవరి 28 వరకు కొనసాగుతుందన్నాడు. ఇటీవల రాజస్థాన్‌లోని జైపూర్ షూట్ షెడ్యూల్‌లో భాగంగా సంబార్ లేక్ ప్రాంతంలోఅమీర్ ఖాన్, ఉపేంద్ర, తలైవా, రెబా మోనికా జాన్ అండ్ టీంపై వచ్చే సన్నివేశాలను చిత్రీకరించినట్టు వార్తలు వచ్చాయని తెలిసిందే. కూలీ చిత్రాన్ని 2025 మే 1న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు.గోల్డ్ అక్రమ రవాణా నేపథ్యంలో వస్తోన్న ఈ మూవీలో సత్యరాజ్, మహేంద్రన్, అక్కినేని నాగార్జున, మంజుమ్మెల్ బాయ్స్ ఫేం సౌబిన్ షాహిర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## బాలయ్యకు కలిసొస్తున్న హీరోయిన్..!



నందమూరి బాలకృష్ణ తో ప్రస్తుతం 3 సినిమాలు నటించి తన క్రేజ్ చాటేలా చేస్తుంది ప్రగ్యా జైశ్వాల్. బాలయ్యతో అఖండ సినిమాలో నటించిన అమ్మడు ఆ సినిమా సూపర్ హిట్ అవ్వడంతో ఆఫర్లు పెద్దగా రాబట్టలేదు కానీ మర్చిపోకుండా చేసుకుంది. ఐతే అఖండ సీక్వల్ లో మళ్లీ ప్రగ్యానే కథానాయికగా ఎంపిక చేశారు. క్రేజీ సీక్వల్ లో నటించడం పట్ల చాలా సంతోషంగా ఉంది ప్రగ్యా జైశ్వాల్. ఐతే అఖండ, అఖండ 2నే కాదు సంక్రాంతికి వస్తున్న డాకు మహారాజ్ సినిమాలో కూడా ప్రగ్యా నటించింది. డాకు మహారాజ్ లో ప్రగ్యా జైశ్వాల్ నిజంగానే ఆడియన్స్ కు సర్ ప్రైజ్ ఇచ్చింది. సినిమాలో శ్రద్ధా శ్రీనాథ్, ఊర్వైె రౌతెలా ఉన్నారని తెలుసు కానీ ప్రగ్యా జైశ్వాల్ కూడా ఉందని ఎవరు ఊహించలేదు. ట్రైలర్ లో ప్రగ్యా ని చూసి ప్రేక్షకులు సర్ ప్రైజ్ అయ్యారు. ఐతే బాలయ్య సినిమాకు ఆమె లక్కీగా మారుతుందని చెప్పొచ్చు. అఖండ లో కలిసి నటించడం వల్ల అది సూపర్ హిట్ అయ్యింది. ఇక ఇప్పుడు రాబోతున్న డాకు మహారాజ్ కూడా బజ్ చూస్తుంటే పక్కా హిట్ అనేలా ఉంది. ఐతే డాకు మహారాజ్ లో తన సెలక్షన్ అంతా డైరెక్టర్ బాబీ చేతుల్లోనే ఉందని అన్నది ప్రగ్యా జైశ్వాల్. సినిమాలో నటించడం కోసం తనకు కాల్ వస్తే చాలా సర్ ప్రైజ్ గా ఫీలయ్యా అన్నది ప్రగ్యా జైశ్వాల్. ఐతే డాకు మహారాజ్ హిట్ పడితే ఎలాగు అఖండ 2 మీద భారీ హైప్ ఉంది కాబట్టి అది ఎలా ఉన్నా సక్సెస్ అందుకునే ఛాన్స్ ఉంటుంది. బాలకృష్ణ, ప్రగ్యా జైశ్వాల్ హిట్ పెయిర్ గా సూపర్ క్రేజ్ తెచ్చుకుంటున్నారు. ఐతే బాలయ్య సినిమాలు తప్ప ప్రగ్యాకి మిగతా ఆఫర్లు రావట్లేదు.బాలకృష్ణకు మాత్రం ఆమె పర్ఫెక్ట్ జోడీ అనిపిస్తుంది. కెరీర్ కాస్త అటు ఇటుగా ఉన్నా ప్రగ్యా జైశ్వాల్ తనకు వచ్చిన అవకాశాలను చేస్తూ వస్తుంది. ఐతే ఆమె బాలయ్య సినిమాల్లో ఆఫర్ రావడం సంతోషాన్ని వ్యక్త పరుస్తుంది. డాకు మహారాజ్ హిట్ పడితే ప్రగ్యాకి వేరే సినిమాల ఆఫర్లు కూడా రావాలని ఫ్యాన్స్ కోరుతున్నారు. ఏది ఏమైనా ప్రగ్యా ని మన డైరెక్టర్స్ సరిగా వాడుకోవట్లేదు అన్నది ఇన్నర్ టాక్. మరి అమ్మడి ఫేట్ రాబోయే సినిమాతో అయినా మారుతుందేమో చూడాలి.




## గేమ్ ఛేంజర్ నుంచి మరో సాంగ్ రిలీజ్

మెగా హీరో రామ్ చరణ్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ గేమ్ ఛేంజర్ మరో రెండు రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఆర్‌ఆర్‌ఆర్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత రామ్ చరణ్ సినిమా వస్తుండటంతో ఈ మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. దిగ్గజ దర్శకుడు శంకర్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. దిల్ రాజు ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ఇప్పటికే మూవీ నుంచి ట్రైలర్‌తో పాటు పాటలను విడుదల చేయగా.. మంచి రెస్పాన్స్ దక్కించుకున్నాయి. అయితే తాజాగా ఈ మూవీ నుంచి మెలోడి సాంగ్‌ను విడుదల చేశారు మేకర్స్. "అలికి పూసిన అరుగు మీద కలికి సుందరినై కూసుంటే పలకరించవేంది ఓ దొర. చిలక ముక్కు చిన్ని నా దొరా". అంటూ ఈ మెలోడి ఉండగా.. రామ్ చరణ్ అంజలిపై ఈ పాటను చిత్రీకరించినట్లు తెలుస్తుంది. ఈ పాటకు కాసర్ల శ్యామ్ లిరిక్స్ అందించగా.. థమన్, ఎస్ రోషిని జేకెవీ కలిసి పాడారు. థమన్ సంగీతం అందించాడు. ఇప్పటికే జరగండి.. జరగండి, ధోప్, రా మచ్చా సాంగ్‌లతో దూసుకుపోతున్న ఈ చిత్రంకి మెలోడి జత కావడంతో సూపర్ హిట్ కాయం అంటున్నారు అభిమానులు.



## శ్రీతేజ్‌ను పరామర్శించిన అల్లు అర్జున్

సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో గాయపడిన బాలుడు శ్రీతేజ్‌ను ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పరామర్శించారు. సికింద్రాబాద్ కిమ్స్ హాస్పిటల్‌కు చేరుకున్న బన్ని.. అక్కడ చికిత్స పొందుతున్న శ్రీతేజ్ ఆరోగ్యం గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అల్లు అర్జున్‌తోపాటు తెలంగాణ ఎఫ్‌డీసీ చైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్ రాజు కూడా ఉన్నారు. కాగా, అల్లు అర్జున్ హాస్పిటల్ రావడంతో కిమ్స్ వద్ద పోలీసులు భారీగా మోహరించారు.

## మెగా బాస్ కే గురిపెట్టిన అంజలి



తెలుగు హీరోయిన్ అంజలి కెరీర్ దేదీప్య మానంగా సాగిపోతున్న సంగతి తెలిసిందే. తమిళ్ తో పాటు తెలుగు చిత్రాల్లోనూ నటిస్తూ బిజీగా ఉంది. స్టార్ హీరోల సరసన సెకెండ్ లీడ్ ఉందంటే? అది సీతమ్మదే అనిపిస్తుంది. ఇప్పటికే విక్టరీ వెంకటేష్ సరసన రెండు సినిమాల్లో నటించంది. అలాగే మాస్ రాజా రవితేజ, నటసింహ బాలకృష్ణ కి జోడీగా నటించింది. ఇవన్నీ అంజలికి కెరీర్ కి దోహద పడిన చిత్రాల్లే. తనదైన ఛరిష్మాతో ప్రత్యేకమై ఇమేజ్ ని సొంతం చేసుకుంది. ఇక %-%గేమ్ ఛేంజర్%-% సినిమాతో పాన్ ఇండియా మార్కెట్ లోకి అడుగు పెడుతుంది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో తెరెకక్కుతోన్న చిత్రం లో అంజలి కీలక పాత్ర పోషిస్తుంది. మరి హీరో రామ్ చరణ్ తో సన్నివేశాలు ఉన్నాయా? లేదా? అన్నది తెలియదు గానీ శంకర్ సినిమా ఛాన్స్ అందుకుని పాన్ ఇండియాలో ఫేమస్ అవుతుంది. ఓ తెలుగు నటి శంకర్ సినిమాలో ఛాన్స్ అందుకోవడం అన్నది గొప్ప విషయమే. ఇందుకు ఓ ప్రత్యేక కారణం కూడా ఉంది. అంజలి మార్షల్ ఆర్ట్స్ ట్రైనింగ్ కూడా తీసుకుంది. ఈ సినిమాకు ఆ విలువిద్య తెలిసిన నటి అయితే బాగుంటుందని శంకర్ ఆమెని ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రచార కార్యక్రమాల్లో అంజలి చురుకుగా పాల్గొంటుంది. ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవిని సైతం ఓ ఛాన్స్ ఇవ్వమని అడుగుతానని అంజలి తెలిపింది. %-%పవన్ కళ్యాణ్ గారితో నటించాను. అల్లు అర్జున్ గారితో కలిసి పనిచేసాను. రామ్ చరణ్ గారితో పనిచేసాను. కానీ వీళ్లందరికీ బాస్ అయిన మెగాస్టార్ చిరంజీవి గారితో మాత్రం నటించ లేకపోయాను అంది. ఆయన్ని కలిసినప్పుడు కచ్చితంగా ఓ ఛాన్స్ అడుగుతానని అంది. గేమ్ ఛేంజర్ చూసి చిరంజీవి తన పనితనాన్ని మెచ్చుకున్నట్లు పేర్కొంది. అంజలి చిరంజీవిని ఛాన్స్ అడిగితే ఆయన కాదంటారా? చిరు నటించే తదుపరి చిత్రంలోనే అవకాశం కల్పిస్తారు. పైగా తెలుగు నటి కాబట్టి నో చెప్పే అవకాశమే ఉండదు.